Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## కన్నడ కొలనులో... విరిసిన కమలం



- మెజార్టీకి అడుగుదూరంలో ఆగిన బీజేపీ
- హంగ్‌తో ఖంగుతిన్న పార్టీలు
- కుర్చీ కోసం మొదలైన పొలిటికల్ గేమ్
- గవర్నర్ కోర్టులో అధికారం బంతి

సరిగ్గా నెలరోజుల క్రితం కర్నాటకలో రాజకీయ వాతావరణం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండింది. ఏ సర్వే చూసినా కాంగ్రెస్ తిరిగి అధికారం చేజిక్కించుకుంటుందనే చెప్పాయి. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వున్నారని, ఈ ప్రభావం కర్నాటక ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని కూడా భావించాయి.

కాని, నెలరోజుల్లోనే అక్కడ సీన్‌ను మార్చేసింది అమిత్‌షా బృందం. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రచారంతో అక్కడ ట్రెండ్ మారింది. 21చోట్ల ప్రధాని మోడీ రోడ్‌షోలు జరిగాయి. బయట రాష్ట్రాలకు చెందిన 50వేల మంది ఆరెస్సెస్ కార్యకర్తలు కర్నాటకలో దిగిపోయారు. కర్నాటక ఆరెస్సెస్ శాఖలు వీరికి సహకరించాయి. నియోజకవర్గానికి 500మంది కార్యకర్తలను బూత్‌లెవల్ ప్రచారానికి వినియోగించారు. అమిత్‌షా బెంగుళూరులోనే తిష్టవేసి ఎన్నికలను పర్యవేక్షించాడు. ఆయన బృందంలోని సభ్యులు గెలుపే లక్ష్యంగా శ్రమించారు. కర్నాటకలో 222 స్థానాలుంటే తమ అభ్యర్థి (మిగతా 11వ పేజీలో)



## అయోమయంలో ఆనం

- 'దేశం' ఉండమంటోంది...
- కేడర్ వదలమంటోంది!

11లో



## అధ్యక్ష పీఠం కన్నాకే

- ఆగమన్నది అందుకే!

**కన్నా లక్ష్మీనారాయణ... అనుకున్నది అనుకున్నట్లు జరిగివుంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాను మెడలో వేసుకుని జగన్ వెంట తిరగాల్సిన నాయకుడు. అనుకున్నది ఒకటైతే జరిగింది ఇంకోటి. పుట్టి బుద్దెరిగినప్పటి నుండి కాంగ్రెస్ నాయకుడిగా వున్న కన్నా లక్ష్మీనారాయణ 2014 ఎన్నికల తర్వాత ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ అనే మర్రి చెట్టు మీద అన్ని పక్షులు ఎగిరిపోయినట్లే ఆయనా ఎగిరిపోయి బీజేపీ గూటిలో వాలాడు. దాదాపు మూడేళ్ళకుపైగానే బీజేపీతో ప్రయాణం చేసాడు.**

ఏపిలో ఇక బీజేపీకి సీన్ లేదని, ప్రత్యేకహోదా ఇవ్వనందుకు ఆ పార్టీపై ప్రజలు కోపంగా వున్నారనే విషయం పసిపిల్లోడికి కూడా తెలుసు. తనకు తెలుగుదేశం అంటే గిట్టదు కాబట్టి వైసిపిలో చేరాలనుకున్నాడు. దీనికి ముహూర్తం కూడా ఫిక్సయ్యింది. కరెక్ట్‌గా పార్టీ మారాలనుకున్న రెండ్రోజుల ముందే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నుండి ఆయనకు ఫోన్ వచ్చినట్లు సమాచారం. అమిత్‌షా ఏం చెప్పాడో, ఈయన ఏం విన్నాడో, కన్నా లక్ష్మీనారాయణ ఆరోగ్యం బాగాలేదని చెప్పి ఆసుపత్రిలో చేరాడు. వైసిపిలో చేరికకు అప్పుడే బ్రేక్ పడింది. ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యి ఇంటికెళ్ళాక కూడా పార్టీ మారే ఊసే లేకుండాపోయింది.

తీరా సీన్ కట్ చేస్తే... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కన్నా లక్ష్మీనారాయణ నియామకం. పురంధరేశ్వరి, సోము వీర్రాజు, మాణిక్యాలరావు వంటి నాయకులు అధ్యక్ష పదవి రేస్‌లో వున్నప్పటికీ కన్నాకు ఈ పదవి అప్పగించారు. ఈ పదవిని అప్పగించేందుకే ఆయనను బీజేపీలో వుండమన్నారు.

తెలుగుదేశం అంటే 'కమ్మ', వైసిపి అంటే 'రెడ్డి' అనే పరిస్థితుల్లో బీజేపీ 'కాపు'కు అధ్యక్షపీఠం వేసింది. కాపుల తరపున ఆల్‌రెడీ జనసేన వుంది. భవిష్యత్‌లో బీజేపీ, జనసేనలు కలిసి పోటీ చేస్తాయనే దానికి కన్నా లక్ష్మీనారాయణను అధ్యక్షుడిని చేయడమే ఒక సంకేతంగా చెప్పుకోవచ్చు. కర్నాటక విజయంతో ఏపిలోనూ బలం పెంచుకోవాలనే దిశగా బీజేపీ ఆలోచన చేయొచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కులం బలం కావాలి. బలమైన వర్గం అండగా రావాలి. కర్నాటకలో లింగాయత్‌లు వెన్నుదన్నుగా నిలవబట్టే బీజేపీకి మెజార్టీ సీట్లు వచ్చాయి. రేపు ఏపిలోనూ 'కాపు'లను మచ్చిక చేసుకునే క్రమంలో బీజేపీ ప్రయాణం ఉండబోతోంది.



# లక్ష్య సాధనే... లక్ష్యం!

## ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన రిజిస్ట్రేషన్ శాఖ

రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వనరులు చేకూర్చేశాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌కు సంబంధించి 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్చి 2018కి ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని అధిగమించింది.

నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్స్‌కు సంబంధించి 19 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వం 194.86కోట్ల రూపాయలు లక్ష్యాన్ని నిర్ధేశించగా, 197.79 కోట్ల రూపాయలు సాధించి దాదాపు 102 శాతాన్ని చేరుకోవడం విశేషం. నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌కు సంబంధించి నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ (ఆర్‌ఓ) కార్యాలయానికి ప్రభుత్వం మార్చి నెలకు గాను రూ.6768.93 లక్షలు కేటాయించగా, రూ.7902.74 లక్షలు ఆదాయాన్ని సాధించింది. అదేవిధంగా, అల్లూరు రూ.294.74 లక్షలకుగాను రూ.307.37 లక్షలు, ఆత్మకూరు రూ. 394 లక్షలకు గాను రూ.344.07 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెం రూ. 698.79 లక్షలకు గాను రూ.769.37 లక్షలు, కావలి రూ. 2065.46 లక్షలకుగాను రూ. 2009.10 లక్షలు, కోవూరు రూ.1297.98 లక్షలకుగాను రూ. 848.98 లక్షలు, స్టోన్‌హౌస్‌పేట రూ.3397.38 లక్షలకు గాను రూ.3306.02 లక్షలు, ఉదయగిరి రూ. 199.88 లక్షలకు గాను రూ. 149.09 లక్షలు, వింజమూరు రూ. 400.28 లక్షలకు గాను రూ. 353.81 లక్షలు ఆదాయాన్ని సాధించాయి. 2017-18 సంవత్సరానికి సంబంధించి రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజుల సంఖ్య తీసుకుంటే, నెల్లూరు (ఆర్‌ఓ) విక్రయాలు 5119, సెటిల్‌మెంట్లు 1115, తనఖాలు 2377, ఇతరత్రా 3634 దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. అదేవిధంగా అల్లూరులో విక్రయాలు 573, సెటిల్‌మెంట్లు 176, తనఖాలు 242, ఇతరత్రా 280 దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. ఆత్మకూరులో విక్రయాలు 959, సెటిల్‌మెంట్లు 430, తనఖాలు 176, ఇతరత్రా 369 దస్తావేజులు రిజిస్టర్ కాగా, బుచ్చిరెడ్డిపాళెంలో విక్రయాలు 1191, సెటిల్‌మెంట్లు 355, తనఖాలు 623, ఇతరత్రా 873 రిజిస్టర్ అయ్యాయి. కావలిలో విక్రయాలు 2578, సెటిల్‌మెంట్లు 753, తనఖాలు 804, ఇతరత్రా 959 కాగా, కోవూరులో విక్రయాలు 1421, సెటిల్‌మెంట్లు 302, తనఖాలు 621, ఇతరత్రా 709 రిజిస్టర్ అయ్యాయి. స్టోన్‌హౌస్‌పేట విక్రయాలు 2811, సెటిల్‌మెంట్లు 473, తనఖాలు 1101, ఇతరత్రా 969, ఉదయగిరి విక్రయాలు 577, సెటిల్‌మెంట్లు 155, తనఖాలు 177, ఇతరత్రా 182 దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. వింజమూరులో విక్రయాలు 823, సెటిల్‌మెంట్లు 347, తనఖాలు 335, ఇతరత్రా 207 దస్తావేజులు రిజిస్టరయ్యాయి.

### ఈ ఏడాది లక్ష్యం అధిగమిస్తాం - జిల్లా రిజిస్ట్రార్ ఎం.అబ్రహాం



నెల్లూరు, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌లకు సంబంధించి 2018-2019 సంవత్సరాలకు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమిస్తామని నెల్లూరుజిల్లా రిజిస్ట్రార్ ఎం.అబ్రహాం తెలిపారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని అధిగమించి 102 శాతం ఆదాయాన్ని సాధించామన్నారు. రిజిస్ట్రేషన్ పరంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌పరంగా ప్రజలకు ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే తనను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# భక్తి పారవశ్యంతో కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

నెల్లూరుజిల్లా బుచ్చి మండలం జొన్నవాడలో కొలువుతీరిన శ్రీ మల్లిఖార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాత్రి ఆలయంలో అర్చకులందరూ కలిసి గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా దీక్షా కంకణం చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారు శేషవాహనంపై ఊరేగారు. స్వామి అమ్మవార్లకు గ్రామంలో తిరుచా ఉత్సవాన్ని నిర్వహించారు. రాత్రి అమ్మవారిని శేషవాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూల అలంకరణ చేసారు. విద్యుద్దీపాలతో శేషవాహనాన్ని శోభాయమానంగా అలంకరించారు. శ్రీస్వామి అమ్మవార్లు పురుషామృగ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. మల్లిఖార్జునస్వామి, కామాక్షితాయి సింహ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రావణసేవ వేడుకగా జరిగింది. స్వామి అమ్మవార్లను రావణ వాహనంపై ఉంచి గజమాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాలతో వైభవంగా గ్రామోత్సవం చేసారు. ఉత్సవంగా వచ్చిన స్వామి వార్లకు భక్తులు టెంకాయలు, పండ్లు నైవేద్యం సమర్పించారు.

### అంగరంగ వైభవంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న జొన్నవాడ శ్రీ మల్లిఖార్జున స్వామి, కామాక్షితాయి వార్ల రథోత్సవం జొన్నవాడ పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్లను ఆలయం నుండి భక్తులు మేళతాళాలతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో శ్రీ స్వామి అమ్మవార్లను కొలువుదీర్చారు. శివనామస్మరణలతో రథోత్సవాన్ని మాఢవీధుల్లో నిర్వహించారు. పెద్దసంఖ్యలో రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రాత్రి అమ్మవారిని గజసింహ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూలంకరణలు చేసారు. అనంతరం అమ్మవారు అమ్మవారి పుట్టినిట్లు అయిన పెనుబల్లి గ్రామానికి తరలి వెళ్ళారు. 15వ తేదీ ఉదయం మల్లిఖార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు అశేష భక్తజన సందోహం నడుమ అత్యంత వైభవంగా కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోకంగా నిర్వహించారు. సాయంత్రం పవిత్ర పెన్నానదిలో ప్రత్యేక పుష్పాలంకరణ, వీద్యుద్దీపాలతో బాణాసంచా వేడుకలతో హంస ప్రతిమలా ఏర్పాటు చేసిన తెప్పపై ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, ఇ.ఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

# ప్రత్యేకహోదా జగనన్న ధ్యేయం

### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

అడ్డగోలు విభజన ద్వారా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రం తిరిగి కోలుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ద్వారా మాత్రమే వాటిని సాధించుకోగలం కనుక, హోదా సాధనే ధ్యేయంగా వైఎస్సార్సీపి అధినేత డా. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం పోరాటం చేస్తున్నారని తిరుపతి పార్లమెంటరీ అధ్యక్షుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. తడ మండలంలోని కాదలూరులో ఈ నెల 13న జరిగిన సమావేశంలో ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ పాలనలో తడ మండలం పరిధిలోని మాంబట్టు సెజ్‌తో పాటు శ్రీసిటీసెజ్‌లను ఏర్పాటుచేసి ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అయితే ప్రస్తుతం ఈ పరిశ్రమల్లో కింది స్థాయి ఉద్యోగాలు తప్ప చదువుకున్న యువతకు ఉద్యోగాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టినవారు స్థానికులకు 75శాతం వరకు ఉద్యోగాలు ఇచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తే యువత పరిస్థితి ఎంతో బాగుపడుతుందన్నారు. అందుకోసం జగనన్న అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారంరెడ్డి మునీష్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, కొమ్మల శేఖర్‌బాబు, మునిరత్నం, గౌస్‌బాషా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర్ల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

వడ్డెరల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర వడ్డెర ఫెడరేషన్ ఛైర్మెన్ డి. మురళి తెలియజేశారు. ఈనెల13న ఆయన నగరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్యాంక్ లింకేజి రుణాల కోసం 15.6 కోట్ల రూపాయలు కేటాయించగా, అందులో 7.80 కోట్లు సబ్సిడీగా అందజేస్తున్నారన్నారు. చేతివృత్తులు, కులవృత్తులతో జీవించే వెనుకబడిన వర్గాలవారికి ముఖ్యమంత్రి 750 కోట్లు మంజూరు చేశారని ఆయన పేర్కొంటూ, బీసీల్లో అనేక కులాలవారు ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసులు, చిత్తూరుజిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.రెడ్డప్ప, రవీంద్రరాజు, రమాదేవి, ఉద్యోగసంఘం అధ్యక్షులు వాసుదేవ, కార్యదర్శి రవి, లోకేష్, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి కాశీవిశ్వనాధునికి పునర్ వైభవం

వెంకటగిరిలోని అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీవిశ్వనాధస్వామి ఆలయానికి పునర్ వైభవం సిద్ధిస్తోంది. ఈ ఆలయానికి పూర్వవైభవాన్ని తీసుకురావాలనే సంకల్పంతో ఆలయంలో ఈ నెల 13 నుంచి ఆలయ పునర్‌వైభవ కుంభాభిషేక మహోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. వేదపండితులు, ఆలయ అర్చకులు ఈ ఆలయంలోని 16 స్తంభాల మండపంలో కలశస్థాపన, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వెంకటగిరి సంస్థానాధీశులైన వెలుగోటి రామప్రసాద్ గోవిందకృష్ణ యాచేంద్ర, భాస్కర సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్రలు సంప్రదాయసిద్ధంగా పూజలు నిర్వహించారు. ఆదిత్యాది నవగ్రహాలకు ఆవాహన, విశేషపూజలు చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు మహాసంప్రోక్షణ నిర్వహించారు. మంత్రజలంతో రాజగోపురంపై ఉన్న 11 కలశాలకు సంప్రోక్షణ చేశారు. అనంతరం దక్షిణామూర్తి స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన ఎంతో వైభవంగా జరిగింది. ఈ విశిష్టపూజల్లో రాజకుటుంబీకుడు డా.విబి సాయికృష్ణ యాచేంద్రతోపాటు, పలువురు రాజకుటుంబీకులు పాల్గొన్నారు.

# నర్సులు...సేవకు ప్రతిరూపాలు

### -జిజిహెచ్ ఛైర్మెన్ చాట్ల

రోగులకు వైద్యులు, వారి కుటుంబసభ్యులు అందజేసే సేవలకంటే నర్సులు చేసే సేవలు అపారమని, నర్సులు సేవకు ప్రతిరూపాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు ప్రశంసించారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి మహోన్నత సేవామూర్తి ఈ వృత్తిని దైవంగా భావించేవారన్నారు. ఆమె జయంతిని ప్రపంచ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. జిజిహెచ్‌లో 350 మంది నర్సులు ఉన్నారని, ఎంతో ఓర్పుతో, సేవాభావంతో వారు ఈ ఆసుపత్రికి వచ్చే రోగులకు అమూల్యమైన సేవలందిస్తున్నారని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన నర్సులకు ఆయన బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవలందిస్తున్న నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ప్రదానం చేశారు. తొలుత జ్యోతి వెలిగించి, కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకృష్ణరాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ రేవతి, కమిటీ సభ్యురాలు బివి లక్ష్మి, సిఐటియు నాయకుడు సతీష్, నర్సుల సంఘం నాయకురాలు వరలక్ష్మి, విజయలక్ష్మి, సత్యవతి, సౌజన్య, రమ, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఎండాకాలంలో...

# మూగజీవాలను కాపాడుకుందాం!

మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజానీకం ఏదో ఒక రకంగా సేదతీర్చుకుంటున్నారు. కాని నోరులేని పశుపక్ష్యాదుల పరిస్థితి ఎంతో దయనీయంగా వుంది. ఎండలకు తట్టుకోలేక, నీళ్ళు లేక అలమటిస్తున్నాయి. ఇలాంటి సమయాలలో పశువులు, పక్షులు తాగేందుకు ఆరుబయట చిన్న తొట్లు పెట్టి నీళ్ళు పోస్తే పశుపక్ష్యాదులను ఒకరకంగా కాపాడుకోగలవారమవుతాం. ఇందుకు ఉదాహరణగా నెల్లూరు అయ్యప్ప స్వామి దేవస్థానంలో పక్షుల కోసం ఒక తొట్టెను ఏర్పాటు చేసి నీరు నింపారు. పావురాలు, పిచుకలు, గోరింకలు, కాకులు ఇలా అనేక రకాల పక్షులు ఆ తొట్టి వద్ద గొంతు తడుపుకుంటున్నాయి. అలాగే ప్రతిఒక్కరు కూడా వారి ఇంటి ఆవరణంలో చిన్న గిన్నెలో గాని, కుండీలో గాని, తొట్టిలోగాని నీరు ఉంచితే ఈ మండే వేసవిలో ఎన్నో పశుపక్ష్యాదుల ప్రాణం నిలిపినవారమవుతాం.

### సంఘీభావం చాటుతూ...

# కదం తొక్కిన వైసిపి సైన్యం



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర 2వేల కిలోమీటర్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా జిల్లాలోని వైసిపి నేతలు, కార్యకర్తలు 14వ తేదీన జిల్లా అంతటా సంఘీభావ పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహించారు. జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లు సంఘీభావ పాదయాత్రలకు నాయకత్వం వహించారు.

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ నుండి విఆర్‌సి సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు వైసిపి కార్పొరేటర్లు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని నీలగిరి సంఘంలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గం టీపీగూడూరులో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో తిరుపతి ఎంపి వి.వరప్రసాద్ పాల్గొన్నారు. సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్రలు జరిగాయి. ఉదయగిరి నియోజకవర్గం వింజమూరులో వైసిపి ఇన్‌ఛార్జ్ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సంఘీభావ పాదయాత్రలో ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు గణపం బాలకృష్ణారెడ్డి, గణపం కృష్ణకిరణ్‌రెడ్డి, మలిరెడ్డి విజయ కుమార్‌రెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకటగిరిలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో, గూడూరులో వైసిపి ఇన్‌ఛార్జ్ మేరిగ మురళి నాయకత్వంలో సంఘీభావ పాదయాత్రలను విజయవంతంగా నిర్వహించారు. కోవూరు నియోజకవర్గంలోని విడవలూరులో ఇన్‌ఛార్జ్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆనం ఇంట నారాయణ



రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం నెల్లూరు సంతపేటలోని మాజీమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఇంటికెళ్లారు.


జిల్లా రాజకీయాలతో పాటు ఆత్మకూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఇటీవలే ఆనం రామనారాయణ రెడ్డి టీడీపీని వీడనున్నాడనే ప్రచారం జరిగింది. ఇది తెలిసి చంద్రబాబు జిల్లా మంత్రులు, నాయకులపై అక్షింతలు వేశారు. ఆనంతో సమన్వయం కుదుర్చుకోవాలంటూ సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి నారాయణ ఆనం ఇంటికి వెళ్ళినట్లుగా తెలుస్తోంది.

# ఎన్‌బికెఆర్‌లో 'జోహో' ప్రాంగణ ఎంపికలు



'జోహో' ప్రాంగణ ఎంపికలకు హాజరైన విద్యార్థులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో అమెరికాకు చెందిన జోహో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇటీవల ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ సంస్థ ప్రతినిధులు ఆనంద్ మరియు అతని బృందం బిటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ ఏర్పాటు చేసింది. వీరు ముందుగా తమ కంపెనీకి సంబంధించిన వివరాలను విద్యార్థులకు వెల్లడించారు. ఈ సంస్థకు అమెరికాతో పాటు చైనా, జపాన్, ఇండియాలలో శాఖలున్నాయి. ప్రస్తుతం రేణిగుంట వద్ద నూతన కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో పనిచేయడానికి ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎన్‌బికెఆర్ విద్యార్థులతో పాటు ఆదిశంకర, శ్రీ వెంకటేశ్వర, గీతాంజలి, నారాయణ, ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా హాజరయ్యారు. ఎంపికైన వారికి 4.20 లక్షలు వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు జోహో ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాంగణ ఎంపికలను ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.


## ఉత్తరక్రియలు

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మానవతామూర్తి
మా అందరికీ అనురాగం, ఆప్యాయతలను పంచిన అమృతమూర్తి
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన ప్రేమమూర్తి
మాకు మార్గదర్శకులు, అత్యంత ఆప్తులు

**డాక్టర్ వేణుంబాక శ్రీనివాసులురెడ్డి గారు**

(అప్తమాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్, చెన్నై)

తే.12.05.2018ది శనివారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

సోమవరపు కృష్ణమూర్తిరెడ్డి - ఇందిరమ్మ, నెల్లూరు.
కొండూరు హరినారాయణరెడ్డి - సత్యవతి, నెల్లూరు.
సోమారెడ్డి దయాకరరెడ్డి - సుజన, చెన్నై.

**ఉత్తరక్రియలు**

తేది. 24.05.2018 గురువారం డో.నెం.28/12, 4వ వీధి, ట్రస్టు పురం, కోడంబాక్కం చెన్నైలోని వారి స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

## 'ప్రభా'తం

# 'సందిగ్ధం'లో కర్ణాటకీయం

**కర్ణాటకలో అత్యధికస్థానాలు సాధించి విజయదుందుభి మోగించిన బిజెపిని అధికారంలోకి రాకుండా నిలువరిచేందుకు కాంగ్రెస్ వ్యూహ రచనలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 112 స్థానాలకు గాను బిజెపి ఓ అడుగు దూరంలోనే ఉండడంతో, ఇదే అదనుగా కాంగ్రెస్ శరవేగంగా పావులు కదుపుతోంది. కాంగ్రెస్-జేడిఎస్ ఒకటైతే తామే అధికారంలోకి రావచ్చనే ధీమాతో 'హంగ్' ఏర్పాటుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. దీంతో కర్ణాటక రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి.**

కర్ణాటక ఎన్నికల ఫలితాలు కలకం సృష్టించాయి. ప్రధాన పార్టీలైన మూడు పార్టీల వారికీ పూర్తిస్థాయి మెజార్టీ రాకపోవడంతో ఇక్కడ ఎవరు ప్రభుత్వం ఏర్పాటుచేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. మే 15న వెలువడిన ఫలితాల్లో బిజెపిదే అగ్రస్థానం. కర్ణాటకలో అత్యధికస్థానాల్లో విజయం సాధించి బిజెపి విజయభేరీ మోగించింది. కన్నడనాట కమలం విజయదరహాసంతో వికసించింది. కర్ణాటక ప్రజలు అత్యధికస్థానాలతో (104) బిజెపికే పట్టం కట్టారు. అయితే, ప్రభుత్వఏర్పాటుకు అవసరమైన 112 స్థానాలు రాకపోవడంతో, ఇదే అదనుగా ఎలాగైనా సరే బిజెపిని అధికారంలోకి రానివ్వకూడదని కాంగ్రెస్ పావులు కదపడం, జేడీఎస్‌తో కలయికకు రంగం సిద్ధం చేస్తూ 'హంగ్' ప్రభుత్వానికి దారులు తీస్తుండడంతో కన్నడనాట రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి.

కర్ణాటకలో మే 12న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 222 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు మే 15న వెలువడ్డాయి. అయితే ఆ రోజే..ఫలితాలు వెలువడుతున్న సమయంలోనే కర్ణాటకలో రసవత్తర రాజకీయాలు ప్రారంభమయ్యాయి. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి కర్ణాటకలో అతిపెద్ద పార్టీగా బిజెపి అవతరించింది. బిజెపికి ఇది చరిత్రాత్మక విజయం. ఉద్దండులైన కాంగ్రెస్ రాజకీయయోధులను సైతం ఓడించి బిజెపి విజయ దుందుభి మోగించింది. ప్రధాని నరేంద్రమోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా బిజెపి బలోపేతం అవుతోన్న నేపథ్యంలో తొలిసారిగా ఇప్పుడు దక్షిణాదిలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధించడంతో బిజెపి బలం మరింతగా పెరిగింది. ఈ గెలుపు ద్వారా దక్షిణభారతంలోనూ బిజెపి తన హవా చాటుకుంది. ప్రధాని మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాల రాజకీయ వ్యూహాల మధ్య కాంగ్రెస్ నిలవలేక చతికిల పడిపోయింది. అయితే, ఫలితాలు వెలువడుతున్న తుదిదశలో జరిగిన అనూహ్య రాజకీయపరిణామాలు బిజెపిని సందిగ్ధతలోకి నెట్టాయి.

ఫలితాలు వెలువడినరోజు సాయంత్రం 4 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం, మొత్తం 222 స్థానాల్లో 104 స్థానాల్లో బిజెపి విజయపథంలో ఉంది. కాంగ్రెస్ 78 స్థానాల్లోనూ, జెడిఎస్ 38 స్థానాల్లోనూ లీడింగ్‌లో ఉండగా, మరో రెండు స్థానాల్లో ఇతరులు విజయపథంలో ఉన్నారు. బిజెపి 104 స్థానాలు సాధించి అతిపెద్ద పార్టీగా తన సత్తా చాటుకుంది. అయితే, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన 112 స్థానాలకు అడుగు దూరంలో నిలబడిపోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు కేవలం 8 స్థానాలు తక్కువ కావడంతో చివరి నిమిషంలో ఏమిచేయాలో బిజెపి నేతలకు అయోమయంగా మారింది. ఇదే అదనుగా కాంగ్రెస్ చకచకా పావులు కదిపింది. కేవలం 78 స్థానాలు మాత్రమే దక్కించుకున్న కాంగ్రెస్, 38 స్థానాల్లో విజయం సాధించిన జెడిఎస్ పార్టీతో బయటినుంచే పొత్తుపెట్టుకోవడానికి సిద్ధం కావడంతో, ఈ రెండు పార్టీలు కలిస్తే 116 స్థానాలు అవుతాయి కనుక, ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందనే ధీమాతో కాంగ్రెస్ నేతలు పావులు కదపడంతో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. కేవలం 38 స్థానాలు దక్కించుకున్న జెడిఎస్ (జనతాదళ్-ఎస్)తో కలవడానికి కాంగ్రెస్ సుముఖంగా ఉండడం, అందుకు ఆ పార్టీ కూడా అంగీకరించినట్లు సమాచారం రావడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. దీంతో ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు సాయంత్రం దాకా రాజకీయాలు చకచకా మారుతూనే వచ్చాయి.

ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేసిన సిద్ధరామయ్య రాజీనామా చేయడం, ఢిల్లీ నుంచి సోనియాగాంధీ ఆదేశంతో కాంగ్రెస్ నేతలు గులామ్‌నబీ అజాద్ వంటివారంతా రంగంలోకి దిగి జేడిఎస్‌తో కలసి ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు రాజకీయ వ్యూహాలు రచించడంతో పరిస్థితి జేడీఎస్ చేతుల్లోకి వచ్చింది. కాంగ్రెస్‌తో కలిస్తే జేడిఎస్ నేత కుమారస్వామికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకైనా సిద్ధమని కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేయడంతో, ఆ పార్టీ కూడా కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకోవడంతో అప్పటిదాకా కేవలం కింగ్‌మేకర్ అవుతుందనుకున్న జేడిఎస్ ఒక్కసారిగా కింగ్ అయ్యే పరిస్థితి వచ్చింది. దీంతో, అత్యధిక స్థానాలు సాధించి కర్ణాటకలో విజయకేతనం ఎగురవేసినా, ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 112 స్థానాలు రాకపోవడంతో బిజెపి పరిస్థితి సందిగ్ధంలో పడింది. ఈ దశలో బిజెపి అగ్రనేతలు అమిత్‌షా తదితరులంతా కలసి కాంగ్రెస్ వ్యూహానికి ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. కేవలం అయిదారు గంటల్లోనే ఈ క్షణక్షణ రాజకీయాలు కర్ణాటకనే కాక, దేశవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. ఫలితాలు వెలువడిన రోజంతా... ఇదే సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్న విషయం ఒక కొలిక్కి రానేలేదు. అధికారంలోకి వచ్చేందుకు ఆయా పార్టీల నేతలు ఎవరికి వారు పోటాపోటీగా వ్యూహాలు రచిస్తుండడంతో కర్ణాటక రాజకీయాలు క్షణక్షణం రసవత్తరంగా మారాయి.

అత్యధిక నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను ఓడించి అక్కడి ప్రజలు బిజెపికి పట్టం కట్టినా, చివరి దశలో ఏర్పడిన ఈ సంకటస్థితి బిజెపికి సవాల్‌గా మారింది. కాంగ్రెస్-జేడిఎస్ ఒకటైతే పూర్తిస్థాయి మెజారిటీకన్నా ఎక్కువ స్థానాలే వస్తాయి కనుక, ఎలాగైనా సరే బిజెపిని అడ్డుకోవడానికి కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతోంది. అయినప్పటికీ కర్ణాటకలో అత్యధికంగా 104 స్థానాలు సాధించి కమలం జెండాను రెపరెపలాడించిన బిజెపికి, ఈ ఎన్నికల్లోనూ సత్తా చాటుతూ అతిపెద్దపార్టీగా అవతరించిన బిజెపికి ఈ పరిస్థితిని అధిగమించడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. ఇప్పటికే గవర్నర్ బీజేపీకి తొలి అవకాశమిచ్చారు. వారంలోపు అసెంబ్లీలో బలనిరూపణ చేసుకోమన్నారు. జేడీఎస్‌లో చీలిక తెచ్చే దిశగా బీజేపీ నాయకత్వం పావులు కదిపింది. దేవేగౌడ పెద్దకొడుకు రేవణ్ణకు డిప్యూటీ సీఎం గాలం వేసింది. ఇది సక్సెస్ అయితే బల నిరూపణ బీజేపీకి పెద్ద సమస్య కాకపోవచ్చు.

# వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు



నెల్లూరుజిల్లాలో ఇటీవల జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. నెల్లూరు దర్గామిట్ట రాంనగర్ శబరి శ్రీరామక్షేత్రంలో ప్రసన్నాంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా లక్షమల్లెలార్చన నేత్రపర్వంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి నగరోత్సవం జరిపారు. ఆంజనేయస్వామి వెండి డాలర్‌తో చిన్నారులకు కంకణధారణ చేశారు. శబరి శ్రీరామక్షేత్రం ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, మేనేజర్ చంద్రారెడ్డి, సభ్యులు సుబ్బరాజు, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి చందన, తులసీదళ అలంకారం నిర్వహించారు. అనంతరం సామూహిక ఆకుపూజ, వడమాల సేవను నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఇ.ఓ జి.రామకృష్ణ, ఛైర్మెన్ డివియస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో లక్ష ఆకుపూజ, శ్రీ సీతారామలక్ష్మణ సమేత సువర్చల ఆంజనేయ స్వామికి స్నపన తిరుమంజనం అనంతరం నగరోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఇ.ఓ జి.రామకృష్ణ, దేవస్థాన పునఃనిర్మాణ కమిటి అధ్యక్షకార్యదర్శులు పెనుగొండ వెంకటసుబ్బారావు, అయితా రామచంద్రరావు, కోశాధికారి ముప్పలశెట్టి వెంకటకృష్ణయ్య, సభ్యులు పర్యవేక్షించారు.

# ముగిసిన శ్రీ రంగనాధుని వసంతోత్సవాలు

నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి దేవాలయంలో ఈ నెల 11 నుంచి మూడురోజులపాటు స్వామివారికి ఎంతో వేడుకగా వసంతోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యుల పర్యవేక్షణలో అర్చకులు స్వామివార్లను శోభాయమానంగా అలంకరించారు. తిరుమంజనసేవలు, విశేష పూలంగిసేవ, దివ్యప్రబంధ గోష్టి, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం చేపట్టారు. ఆళ్వార్లకు పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. మూడవరోజైన ఆదివారం రాత్రి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ కె. జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.




## సిగ్గుచేటు పని

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి వెళుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాపై తెలుగుదేశం వాళ్ళు భౌతిక దాడులకు దిగడం సిగ్గుచేటు. ఆయనది రాజకీయ పర్యటన కాదు. తిరుమలకు ఒక భక్తుడిగా వచ్చాడు. దేశ విదేశాల నుండి తిరుమలకు వచ్చే భక్తులను గౌరవించడం మన సంస్కృతి. అమిత్‌షా రాజకీయ పర్యటనకు వచ్చుంటే నిరసన తెలుపొచ్చు, ధర్నాలు చేయొచ్చు. దైవదర్శనానికి వచ్చిన వాళ్ళను ఇలా ఇబ్బంది పెట్టడం మంచి, మర్యాద తెలిసినవాళ్ళు చేసే పని కాదు.

**– పి.కృష్ణచైతన్య ప్రసాద్, నెల్లూరు.**

## ఆంక్షల వల్లే ఈ అనర్థాలు

భారతదేశంలో మహిళలపై ముఖ్యంగా చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు అత్యంత దారుణంగా వుంటున్నాయి. అత్యాచారాలు చేయడం, పసిబిడ్డలను చంపడం పరిపాటయ్యింది. కామం తలకెక్కిన కామాంధులు చేసే పనులు ఇవి. ఇలాంటి వారికి తక్షణం కఠిన శిక్షలు అమలుచేసే విధంగా చట్టాలు తీసుకురావాలి. మన దేశంలో శృంగారంపై ఆంక్షలెక్కువ. మానవ జీవితంలో శృంగారం ఓ భాగం. మనిషి మలమూత్రాలు అర్జంట్‌గా వచ్చినప్పుడు ఎలా నియంత్రించుకోలేడో, శృంగార కోరికలు కూడా అంతే! అయితే కొందరు నిగ్రహం పాటిస్తారు. నిగ్రహం లేని వెధవలు అడ్డగోలు పనులకు పాల్పడుతుంటారు. దుబాయ్ లాంటి ముస్లిం దేశాలలోనే కొన్ని ప్రాంతాల్లో స్వేచ్ఛాశృంగారానికి అనుమతిస్తున్నారు. మన దేశంలో కూడా కొన్ని ప్రాంతాల్లో లైసెన్స్‌డ్ సెక్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఈ కామాంధులు పసిబిడ్డలు, ఆడబిడ్డల మీద పడడం తగ్గుతుంది.

**– ఎస్.కిషోర్, రెడ్‌హిల్స్.**

## మోడీపై వ్యతిరేకత ఎందుకు?

ప్రధాని నరేంద్ర మోడీ పాలన పట్ల కొందరు అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తి దేనికి? పెద్దనోట్ల రద్దు అంటున్నారు. దానివల్ల ఆశించిన ప్రయోజనాలు రాకపోయి వుండొచ్చు, నకిలీ కరెన్సీ తగ్గింది కదా! జిఎస్టీని విమర్శిస్తున్నారు. జిఎస్టీ వల్ల దేశానికి పన్నులు సక్రమంగా కడుతున్నారు. రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరుతుంది. అదే సమయంలో వస్తువుల ధరలు తగ్గాయి. ఈ నాలుగేళ్ళలో కేంద్రప్రభుత్వంపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. కుంభకోణాలు లేవు. గత యూపిఏ ప్రభుత్వంలో లాగా ఉగ్రవాద దాడులు లేవు. విదేశాంగ విధానం ఎంతో బాగుంది. ప్రపంచ దేశాలలో భారత దేశ ప్రతిష్ట ఎంతగానో పెరిగింది. 70ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో గబ్బును నాలుగేళ్ళలో కడిగిపారేయాలంటే ఎలా కుదురుతుంది.

**– పాపన నాగేశ్వరరావు, నెల్లూరు.**

# త్వరలోనే పంచాయితీ యుద్ధం!



2019 అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ పోరు అయితే దానికి ముందుగా వచ్చే స్థానిక ఎన్నికలను క్వాలిఫైయింగ్ పోటీలుగా చెప్పుకోవచ్చు. ఇలాంటి పోటీలే త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్నాయి. ఎన్నికలలోకెల్లా అత్యంత క్లిష్టమైనవి, ఉద్రిక్తతతో కూడుకున్నవి పంచాయితీ ఎన్నికలు. గ్రామాలలోని వర్గాల మధ్య ప్రతిష్టాత్మకంగా జరిగే ఎన్నికలివి.

2013లో పంచాయితీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది జూలై ఆఖరకు పంచాయితీల పదవీ కాలం ముగియనుంది. దీంతో పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తుచేస్తోంది. ఈమేరకు ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారుపై ఆయా జిల్లాల్లో అధికారులకు ఆదేశాలిచ్చింది.

జిల్లాలో 940 పంచాయితీలున్నాయి. వీటిలో వెంకటగిరి నియోజకవర్గంలోని 9పంచాయితీల వ్యవహారం పెండింగ్‌లో వుంది. మిగతా 931 పంచాయితీలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలి. అయితే జిల్లాలో 9మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చాలనే ప్రతిపాదన తుది అంకంలో వుంది. వీటిని మున్సిపాల్టీలుగా మార్చాలంటే మరికొన్ని మైనర్ పంచాయితీలను వాటిలో విలీనం చేయాల్సివుంటుంది. కాబట్టి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే మున్సిపాల్టీల లెక్క తేలాలి. అది తేలకుంటే ప్రతిపాదనలో వున్న మేజర్ పంచాయితీలకు ఎన్నికలు తప్పవు.

పంచాయితీలలో ఎన్నికల సందడి మొదలుకానుంది. ఇవి పార్టీ గుర్తులకు అతీతంగా జరిగే ఎన్నికలు. అయినా కూడా ఏ పంచాయితీలో ఏ పార్టీ గెలిచిందన్నది స్పష్టంగా తెలుస్తుంది. కాబట్టి అసెంబ్లీ ఎన్నికల వేడి పంచాయితీల నుండే మొదలుకానుంది.

# నానుతున్న నారాయణ







## • వస్తే ఓకే.... లేకుంటే మాకే!

చాలాకాలంగా మంత్రి నారాయణ పేరు జిల్లాలో నానుతుంది. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తాడనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పలుసార్లు ఆయన తాను పోటీ చేయనని చెప్పినప్పటికీ ఆ ప్రచారం మాత్రం ఆగడం లేదు. మొదటినుండి నెల్లూరు నగరం నుండి నారాయణ పోటీ చేస్తాడనే ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం ఓట్లే ఎక్కువ. నారాయణ ఇన్‌స్టిట్యూట్స్, మందీమార్భలం ఎక్కువుగా ఈ నియోజకవర్గ పరిధిలోనే వుంది. అయితే నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఏమంత బాగాలేదు. 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే నగరంలో ఆ పార్టీకి చివరి గెలుపు. నగరంలో ఆ తర్వాత చెప్పుకోదగ్గ విజయాలేవీ లేవు. ఇప్పుడింకా సమీకరణలు మారాయి. ప్రతిపక్ష వైకాపా ఇంకా బలంగా తయారైంది. బలహీనవర్గాలకు చెందిన వాడైనప్పటికీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ బలంగానే నిలబడుతున్నాడు. వ్యతిరేకత తెచ్చుకోలేదు. అగ్రవర్ణాలతో పాటు ముస్లిం, క్రైస్తవులలోనూ పట్టు సాధించాడు. తెలుగుదేశంకు పట్టున్న నెల్లూరు తూర్పు ప్రాంతంలో సైతం వైసిపికి బలమైన ఓటుబ్యాంకును ఏర్పరచుకున్నాడు.

నెల్లూరు నగరంలో పరిస్థితులు ఆశాజనకంగా వుండవని, నెల్లూరురూరల్ అయితే బెటర్ అని, ఆ వైపుగా కూడా నారాయణ పేరు వినిపించింది. అయితే అక్కడ కూడా డేంజరే. అక్కడా వైసిపి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చాలా స్ట్రాంగ్‌గా వున్నాడు. అనునిత్యం ప్రజల్లో వుంటున్నాడు. జనాలతో సామాన్యుడిగా కలిసిపోతున్నాడు. దీనికితోడు నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లెక్కువ. రూరల్‌లో గ్రామాలున్నాయి. ఈసారి రైతుల్లో టీడీపీపై తీవ్ర వ్యతిరేకత ఉంది. కాబట్టి నారాయణకు ఇది కూడా సేఫ్‌జోన్ కాదు.

ఈ రెండుచోట్లా ఎక్కడైనా నారాయణ పోటీచేస్తే ఓకే... నెల్లూరు సిటీ నుండి ఆయన పోటీ చేయకుంటే మాత్రం సీటు మాకే అనే నమ్మకంతో మైనార్టీల నుండి అబ్దుల్ అజీజ్, మహిళల నుండి అనూరాధ, శ్రీమతి వసంతలక్ష్మి, ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ఆయనను వదలడం లేదు.

# చంద్రబాబు రాక్షసుడే..!

**- ఎమ్మెల్సీ బీద**



జగన్ చెప్పినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక్షసుడేనని, పనిలోనూ, పట్టుదలలోనూ, అభివృద్ధిలోనూ, అవినీతిపరుల అంతు చూడడంలోనూ ఆయన రాక్షసుడేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. 13వ తేదీ నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం రాక్షసుడిలా పనిచేస్తున్న చంద్రబాబును, రాష్ట్రాన్ని రాక్షసుడిలా దోచుకున్న జగన్ విమర్శించడం కామెడీగా వుందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాపై ప్రతిపక్ష నేత జగన్ అలివిమాలిన ప్రేమ చూపిస్తున్నాడని, ఇదే జీజేపీ నాయకులు ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని ఐదుకోట్ల ఆంధ్రులను మోసం చేసినప్పుడు జగన్మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీజేపీపై జగన్ ఎందుకంత ప్రేమ చూపిస్తున్నాడో ప్రజలకు వివరించాలని బీద డిమాండ్ చేశాడు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు పాల్‌శెట్టి, టీడీపీ నాయకులు బి.మనోహర్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, కువ్వారపు బాలాజీ, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అలక్ష్యం వీడండి..

**- పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ హితవు**



అలసత్వం వీడండి.. అంకితభావంతో పనిచేయండి.. అంటూ జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పోలీసు అధికారులకు హితవు పలికారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈనెల 13న నెల్లూరులోని కొత్త జడ్పీ సమావేశం మందిరంలో జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలతో పోలీసులకు సత్సంబంధాలు ఉండేలా, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, ఎర్రచందనం, సిలికా అక్రమరవాణా, అక్రమ బెల్టుషాపులను, క్రికెట్ బెట్టింగ్‌లను పూర్తిస్థాయిలో నిరోధించాలన్నారు. అనంతరం, పలు చోరీకేసుల్లో నిందితులను అరెస్ట్ చేసిన వారిని, ఎర్రచందనం అక్రమరవాణా నిరోధించడంలో ప్రతిభ కనపరచిన వారికి జిల్లా ఎస్పీ నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శరత్‌బాబు, ఓఎస్డీ విఠలేశ్వర్ పాల్గొన్నారు.

# వెనకబడ్డ ఎమ్మెల్యేలు

## చంద్రబాబు ర్యాంకుల్లో కనిపించని నెల్లూరోళ్ళు






ఇంటర్‌లో, టెన్త్ ఫలితాలలో గ్రేడ్‌లు చూస్తుంటాం. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తన మంత్రులకు, ఎమ్మెల్యేలకు ర్యాంకులు, గ్రేడ్‌లు వంటివిస్తుంటారు. గతంలో మంత్రులకు ర్యాంకులు ప్రకటించినప్పుడు మన జిల్లా మంత్రి నారాయణ చివరి స్థానానికి పోవడం, అది వివాదం కావడం జరిగింది. మంత్రులకు మల్లే ఎమ్మెల్యేలకు కూడా ఆయన గ్రేడ్‌లు ప్రకటించారు. 70శాతం సంతృప్తి మార్కును దాటిన ఎమ్మెల్యేలకు ఆయన ఏ-1గ్రేడ్‌ను ప్రకటించారు. రాష్ట్రం మొత్తం మీద తెలుగుదేశం ఎమ్మెల్యేలలో 13మంది మాత్రమే ఏ-1 గ్రేడ్ సాధించారు. మన జిల్లాలో టీడీపీకి వైసిపి గోడ దూకి వచ్చిన ఎమ్మెల్యేను కూడా కలుపుకుంటే నలుగురు ఎమ్మెల్యేలున్నారు. నలుగురికీ కూడా ఏ-1 గ్రేడ్ రాలేదు.

జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేల మీద ప్రజల్లో అసంతృప్తి వుంది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ దఫాలో వ్యతిరేకత తెచ్చుకున్నాడు. పలు వివాదాలను కొని తెచ్చుకున్నాడు. కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి పార్టీలోనే ఒక వర్గం వ్యతిరేకంగా వుంది. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు ప్రజలకు అందుబాటులో వుండడని పేరుంది. పార్టీ కార్యకర్తలు, నాయకులకు కూడా ఆయన పెద్దగా పనులు చేయలేకపోతున్నాడు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వైసిపి నుండి టీడీపీలో చేరాడు. సహజంగానే దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వుంటుంది. నియోజవర్గంలోని పార్టీలో కూడా సమన్వయం లేదు. కాబట్టి చంద్రబాబు ఏ-1 గ్రేడ్‌ను వీళ్ళు అందుకోలేకపోయారు.

# అరుదైన నాయకా... వివేకా

## నివాళులర్పించిన రఘువీరారెడ్డి



రాష్ట్ర రాజకీయాలలోనే ఆనం వివేకానందరెడ్డిలాంటి అరుదైన నాయకుడిని చూడలేమని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు.

11వ తేదీ నెల్లూరొచ్చిన ఆయన కాపువీధిలోని ఆనం వివేకా ఇంటికి వెళ్ళారు. ఆనం వివేకా చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన సోదరులు ఆనం రామనారాయణరెడ్డి, జయకుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, కుమారులు ఏ.సి. సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డిలను పరామర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వివేకాతో తనకు ఎంతో అనుబంధముందని, నెల్లూరు మీద, నెల్లూరు ప్రజల మీద ఆయన ఎంతో ప్రేమ చూపించేవాడని, నెల్లూరుకు ఆయన లేని లోటు తీర్చలేనిదని రఘువీరారెడ్డి పేర్కొన్నారు.




# త్వరలో కొత్త నెల్లూరును చూస్తారు!



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

పదే పది నెలల్లో నెల్లూరు నగరం రూపురేఖలు మారిపోనున్నాయని, ఈ నగర అందాన్ని చూసి ప్రజలే నోరెళ్లబెడతారని మున్సిపల్ మంత్రి పి.నారాయణ నమ్మకంగా చెబుతున్నారు. 13వ తేదీన టీడీపీ నాయకులు టి.రమేష్‌రెడ్డి, టి.అనూరాధలు నెల్లూరు 13, 15, 16డివిజన్‌ల పరిధిలోని స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇక్కడికొచ్చిన మంత్రి నారాయణ నెల్లూరు నగరం సుందరంగా తయారు కానుందని చెప్పారు. భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్‌ల కోసం రోడ్లను తవ్వడం, తవ్విన రోడ్ల మూలంగా ప్రజలు ఇబ్బంది పడుతుండడం వాస్తవమే. ఈ కష్టాలు ఇంకొద్ది కాలమే. నగరంలో త్వరలో 450కిలోమీటర్ల కొత్తరోడ్లను నిర్మించబోతున్నాం. ఇందుకోసం అధికారులు 500కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. గత రెండేళ్లలో 90కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నగరంలో అవసరమైన చోట ఫ్లై ఓవర్ వంతెనలు నిర్మించాలనుకుంటున్నాం. నగరంలో ట్రాఫిక్‌రద్దీని తగ్గించేందుకు రింగ్‌రోడ్డు మీద కసరత్తు జరుగుతోంది. భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లకు మంజూరైన 1100కోట్ల హడ్కో ఋణాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా కేబినెట్‌లో తీర్మానం జరిగింది. నగరంలో పేదల కోసం 44వేల ఇళ్లను నిర్మిస్తున్నాం. ఎటుచూసినా కూడా మరో పది నెలల్లో నెల్లూరుకు మంచి రోజులొచ్చేసినట్లేనని నారాయణ చెప్పుకొచ్చారు.

## నెల్లూరు కబుర్లు



## బీజేపీ సంబరాలు

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నెల్లూరు మినీబైపాస్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద భారీ ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. బీజేపీ జెండాలు చేతబట్టి జై మోడీ అంటూ నినాదాలు చేసారు.

## నెంబర్‌ల స్థానంలో పేర్లు

### నగర పోలీస్‌స్టేషన్ల పునర్విభజన



నెల్లూరు నగరంలో మొత్తం ఏడు పోలీస్‌స్టేషన్‌లున్నాయి. 1, 2, 3, 4, 5 నగర పోలీస్‌స్టేషన్‌లతో పాటు బాలాజీ నగర్, నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లు ప్రత్యేకంగా వున్నాయి. కొన్ని పోలీసుస్టేషన్‌లు వున్న ప్రాంతానికి, వాటికి కేటాయించిన పరిధి ప్రాంతానికి సంబంధం వుండేది కాదు. ఉదాహరణకు నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌నే తీసుకుందాం. స్టేషన్ వుండేది రైల్వేస్టేషన్ రోడ్డులో, నగరం చుట్టుపక్కల గ్రామాలు ఈ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. స్టేషన్ నుండి ఒక్కో ఊరికి పది నుండి పాతిక కిలోమీటర్ల దాకా దూరం ఉంటుంది. అది కూడా ఒక దిక్కయితే ఫరవాలేదు. నాలుగు దిక్కులా వుంటాయి. రాఘవ సినీ కాంప్లెక్స్ ఏరియా నాలుగో నగరస్టేషన్‌కు దగ్గర. ఇది వన్‌టౌన్ పరిధిలో వుంటుంది. ఏదన్నా సంఘటన జరిగితే పోలీసులు వీలైనంత త్వరగా అక్కడికి చేరుకునేలా ఆయా పోలీస్‌స్టేషన్‌లు పరిధిలోని ప్రాంతాలుండాలి.

ఈ దిశగానే కొంత కసరత్తు జరిపి నగరంలోని పోలీసు స్టేషన్లను పునర్విభజన చేసాడు జిల్లా ఎస్పీ రామకృష్ణ. ముందు పోలీసుస్టేషన్‌లకు నెంబర్లు తీసేసాడు. వన్‌టౌన్‌ను చిన్నబజారు పోలీసుస్టేషన్‌గా, టూటౌన్‌ను నవాబుపేట పోలీసుస్టేషన్‌గా, త్రీ టౌన్‌ను సంతపేట పోలీసుస్టేషన్‌గా, ఫోర్త్‌టౌన్‌ను దర్గామిట్ట పోలీసు స్టేషన్‌గా, ఐదోటౌన్‌ను వేదాయపాలెం పోలీసుస్టేషన్‌గా, ఆరో నగర పిఎస్‌ను బాలాజీ నగర్ పోలీసుస్టేషన్‌గా మార్చారు. ఆయా ప్రాంతాల పరిధిలలో కూడా మార్పులు చేసి ఈ స్టేషన్‌లకు కలిపారు.

## ‘జనం కోసం మనం’ నిలవాలి

**- మేయర్ అబ్దుల్ అజీజ్**



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్

సమాజసేవాభావంతో ముందడుగు వేస్తూ ఆ విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమంటూ నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ‘జనం కోసం మనం’ స్వచ్ఛంధ సేవాసంస్థ యువకులను అభినందించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న నగరంలోని కోటమిట్ట సమీపంలో ఉన్న మహాలక్ష్మమ్మగుడి ప్రాంతంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయగా, దానిని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయాలన్న ఉన్నతాశయంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆ సంస్థ నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజానాయుడు, జాకీర్, మొయినుద్దీన్, శరత్‌చంద్ర, టోనీబాబు, సేవా సంస్థ సభ్యులు హుస్సేన్, బాజీ, వికాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయితీరాజ్ ఉద్యోగుల సంఘం

## రాష్ట్ర కార్యదర్శిగా భీమిరెడ్డి

ఇంతవరకు పంచాయితీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.భీమిరెడ్డిని సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 13వ తేదీ విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఈ పదవికి ఎన్నుకోవడం జరిగింది. అలాగే రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జడ్పీ ఉద్యోగి ఎస్.కె.బాషాను ఎన్నుకున్నారు.

### అడ్రస్ మారిన

## జిల్లా పంచాయితీరాజ్ ఆఫీస్

నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో 2కోట్లతో నిర్మించిన జిల్లా పంచాయితీరాజ్ కార్యాలయాన్ని ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా ఉద్యోగులే ప్రారంభించుకున్నారు. పాత జడ్పీ కార్యాలయంలో వున్న ఆఫీసును, ఫర్నీచర్, ఫైళ్లను ఇక్కడకు మార్చేసుకున్నారు. అయితే ఎలాంటి ఆర్భాటపు ప్రారంభోత్సవాలు లేకుండా చేయడంపై ప్రజాప్రతినిధులు కొంత అసంతృప్తితో వున్నట్లు తెలుస్తోంది.

## నేత్రపర్వంగా రుక్మిణీ, శ్రీకృష్ణుల కళ్యాణం



నెల్లూరు ఇస్కాన్ మందిరంలో ఈ నెల 13న రాత్రి రుక్మిణీ శ్రీకృష్ణుల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కళ్యాణ ఘట్టాలను అర్చకులు తాత్పర్యసహితంగా వివరించారు. ఈ సందర్భంగా స్వామివారికి బంగారు యజ్ఞోపవీతాన్ని, అమ్మవారికి బంగారు తాళిబొట్టును పద్మనారాయణరెడ్డి, సుమతి దంపతులు కైంకర్యం చేశారు. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుకదేవస్వామి ప్రవచించారు. ఉభయదాతలుగా దాసరి యమున, డి.శ్రీనివాసులు, సులోచన, అన్నం వెంకయ్య, మంజులమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా హాస్టల్స్ సంక్షేమ సంఘం ఎన్నికలు

జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్స్ సంఘం ఎన్నికలు నెల్లూరులోని ఎన్‌జిఓ హోంలో ఈనెల 11న ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ఈదూరు విజయకుమార్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మూడవసారి కూడా ఎన్నిక కావడం విశేషం. అదేవిధంగా, ప్రధాన కార్యదర్శిగా కెవి కృష్ణయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా హజరత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ఉమాశంకర్ స్వరూప్, కోశాధికారిగా డి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.లక్ష్మీరాజ్యం, జె.సునీల్‌కుమార్, కె. రమణారెడ్డి, ఎన్ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీలుగా ఎం.మస్తానయ్య, జి.శ్రీనివాసులు, టి. ఉషారాణి, దేవకుమార్ తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా ఎన్‌జిఓ సంఘం కోశాధికారి వెంకటేశ్వర్లు, నెల్లూరు నగర అధ్యక్షుడు రామకృష్ణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, రాష్ట్ర హాస్టల్స్ అసోసియేషన్ కోశాధికారి రాంబాబు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

## నెల్లూరుకవికి చీరాలలో సన్మానం



సత్కారాన్నందుకుంటున్న బొగ్గరపు రాధాకృష్ణమూర్తి

ప్రకాశం జిల్లా చీరాలలో నెల్లూరు కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి ఘనసన్మానం లభించింది. చీరాలలోని కళాంజలి సాంస్కృతిక మిత్రమండలి ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో ‘తుమ్మల సీతారామమూర్తి రచనలు - సామాజిక సందేశం’ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో రాధాకృష్ణమూర్తి రాసిన వ్యాసానికి ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఇటీవల చీరాల లయన్స్‌క్లబ్ భవన్‌లో జరిగిన సభలో కళాంజలి అధ్యక్షుడు లయన్ కాకరపర్తి వెంకటేశ్వర్లు, అజో విభో కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అప్పాజోశ్యుల సత్యనారాయణ చేతుల మీదుగా ఆయనకు ఘనసత్కారం జరిగింది. వెయ్యి రూపాయల నగదు బహుమతితో పాటు, శాలువా, జ్ఞాపికతో కవి బొగ్గరపును సన్మానించారు. అనంతరం, తుమ్మల సీతారామమూర్తి సాహిత్యంపై బొగ్గరపు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తిని నెల్లూరులోని ఆచార్య ఆదిత్య, ఏవీ ఆనంద్, ప్రముఖ కవులు డా. గంగిశెట్టి శివకుమార్, చిన్ని నారాయణరావు తదితరులు అభినందించారు.

# వైకాపావన్నీ లాలూచీ రాజకీయాలు



సైకిల్ యాత్రలో పాల్గొన్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో లాలూచీ రాజకీయాలు చేస్తుందని, ప్రజలు అవన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న ఆయన చిల్లకూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బ, తమ్మినపట్నం, లింగవరం, వరగలి గ్రామాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి సైకిల్‌యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరగలిలో మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రజల ఆత్మాభిమానాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన వైఎస్సార్సీపి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రత్యేకహోదాపై మోసపు మాటలు మాట్లాడుతోందన్నారు. హోదాను ఇవ్వాల్సిన మోదీని ఒక్కమాట కూడా అన కుండా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించడంలో అర్థమేమిటన్నారు. వైఎస్సార్సీపి తీరును ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. బిజెపికి భయపడి వైఎస్సార్సీపి తెరచాటు రాజకీయాలు చేస్తున్నదని ఆయన విమర్శించారు.

ఈ కార్యక్రమంలో యరటపల్లి జానకిరామిరెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి, చేవూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కలిసి నడిస్తే గెలుపు మనదే!

## నెల్లూరు నేతలకు చంద్రబాబు ఉద్బోధ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 12వ తేదీన అమరావతిలో నెల్లూరుజిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్ నాథ్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్ల మెంటరీ జనరల్ సెక్రటరీ జయనాగే శ్వరరెడ్డి, కార్యదర్శులు ఎరిక్సన్‌బాబు, రెడ్యా వెంకటసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ఇన్‌ఛార్జ్‌లు బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలతో సమా వేశమయ్యారు.

ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లతో చంద్ర బాబు విడివిడిగా మాట్లాడి పరిస్థితి పై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వైసిపి ఎంపీలు రాజీనామా చేసిన నేపథ్యంలో పార్ల మెంటు స్థానాలకు ఉపఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయని, ఇప్పటికిప్పుడు ఉపఎన్నికలు వచ్చినా నెల్లూరు పార్ల



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశంలో పాల్గొన్న నెల్లూరు తెదేపా నాయకులు

మెంటు స్థానంలో తెలుగుదేశం గెలు స్తుందని, పార్టీ పరిస్థితి బాగా మెరుగు పడిందంటూ చంద్రబాబు తన వాళ్ళకు ధైర్యం చెప్పారు. మీ జిల్లాలో నాయకుల మధ్య సమన్వయం లేదు, కొందరు ఎడ మొగం పెడమొగంగా వుంటున్నారు. ఇలాంటి పాత అలవాట్లు మానుకోండి, కలసికట్టుగా ప్రజల్లోకి వెళ్ళండి. మీరంతా ఒకటే అనే అభిప్రాయాన్ని కార్యకర్తల్లో కలిగించండంటూ చంద్రబాబు హితోప దేశం చేసారు. ఆనం కుటుంబం మన తోనే వుంటుందని, వ్యక్తిగత కారణాలతో ఆనం రామనారాయణరెడ్డి ఈరోజు సమా వేశానికి రాలేకపోయానని చెప్పాడని, ఆ కుటుంబంపై వస్తున్న వార్తలను నమ్మొద్దని చంద్రబాబు చెప్పడం జరిగింది. చంద్ర బాబు వన్ టూ వన్ మాట్లాడడంతో వెళ్ళిన నాయకులు సంతృప్తి చెందారు.

# 24న జిల్లా మినీ మహానాడు



తెలుగుదేశంపార్టీ జిల్లా మినీ మహానాడును ఈ నెల 24వ తేదీన నిర్వహించాలని తీర్మానించారు. 13వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఈ విషయమై నాయకులతో సమీక్ష జరిపారు. నెల్లూరు కెవిఆర్ పెట్రోల్‌బంకు సెంటర్‌లోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు మినీమహానాడు జరుపను న్నారు. గతంలోకంటే ఘనంగా జరపాలని నిర్ణయిం చారు. మినీమహానాడు కోసం ఎవరు ఏం పని చేయాలన్న దానిపై చర్చించుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు జరపబోయే చివరి మినీమహానాడు ఇదే! కాబట్టి దీనిని విజయవంతం చేయాలని, 24తేదీలోపు నియోజకవర్గాల వారీగా మనీమహానాడులు నిర్వహించాలని నిర్ణయించారు.

# 'నుడా' ఆధ్వర్యంలో త్వరలో ట్యాంక్‌బండ్

## - కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి చెరువు గట్టు వెంబడి ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉండేవిధంగా.. అత్యద్భు తంగా ట్యాంక్‌బండ్‌ను ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నామని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈనెల 12న నెల్లూరు, బాలాజీనగర్‌లోని త్యాగరాజ కల్యాణ మండపంలో జరిగిన 13, 14 డివిజన్ల తెలుగుదేశం పార్టీ కమిటీ సమా వేశంలో 'నుడా' ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు కార్యక్రమాలను ఆయన వివ రించారు. బాలాజీనగర్ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేందుకు వేపదొరువు వద్ద ఒక మంచి పార్కును నిర్మించబోతు న్నామన్నారు. వేపదొరువు స్థలాన్ని గత పదిహేనేళ్లుగా అన్యాక్రాంతం కాకుండా ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ కాపాడుతున్నా రని ఆయన అంటూ, ఆ స్థలంలోనే నుడా పార్కు నిర్మాణం చేపట్టనుందని తెలిపారు. నగరంలోని తూర్పు ప్రాంతాలకు పెన్నా నది నీటిని అందించేందుకు తాను కౌన్సి లర్‌గా పనిచేసిన సమయంలో అధికార పార్టీలో ఉన్నా లేకున్నా పోరాటం చేసి సాధించామన్నారు. అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మెన్ అనూరాధ సహకారంతో 13, 14 డివిజన్ల ప్రజల దాహార్తిని తీర్చామన్నారు. ప్రస్తుతం పురపాలకమంత్రి డా. నారాయణ సహకారంతో నగరంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిల సాధనకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉచ్చి భువ నేశ్వరిప్రసాద్, నాయకులు టి.మస్తాన్, పసుపులేటి మల్లికార్జున, ఆకుల హను మంతరావు,పి. రమేస్, శ్రీకృష్ణ, శీలం మల్లి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 2 నుంచి 'అన్నక్యాంటీన్లు'



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు

జిల్లాలో జూన్ 2వ తేది నుంచి అన్నక్యాంటీన్లు ఏర్పాటుచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలియ జేశారు. ఈనెల 11న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారు లతో ఆయన సమావేశమై ప్రభుత్వ కార్య క్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి జిల్లాలో మొత్తం 14 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామని, వాటి ఏర్పాటుకు సిద్ధం కావాలని ఆదేశించారు. నెల్లూరులో 10, కావలిలో 2, గూడూరు, వెంకటగిరిల్లో ఒక్కొక్కటి వంతున అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. వీటి ఏర్పాటు విషయమై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందిస్తుండాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి, అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ మహేష్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఐసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

## • 93.22 శాతం ఉత్తీర్ణత

ఐసెట్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. జిల్లాలో 93.90 శాతం ఉత్తీర్ణతతో బాలికల కంటే బాలురు ముందడుగులో ఉన్నారు. ఎంబిఏ, ఎంసిఏ విభాగాల్లో ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన ఐసెట్‌లో బాలురు మంచి ఉత్తీ ర్ణత సాధించడం విశేషం. జిల్లాలో 2214 మంది బాలికలు, 1640 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 2079 మంది బాలురు, 1505 మంది బాలికలు ఉత్తీర్ణులు కావడం అభినందనీయం. బాలురు 93.90 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 91.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా, ఐసెట్‌లో నాయుడుపేటలోని విశ్వం కళాశాలలో డిగ్రీ చదివిన విద్యార్థిని ఎం.వి కృష్ణవేణి జిల్లాలోను, యూనివర్శిటీ స్థాయిలోను ప్రథమ ర్యాంకును సాధించిందని, అదేవిధంగా రాష్ట్రస్థాయిలో 32వ ర్యాంకును సాధించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ టి. ధనంజయ తెలియజేశారు. ఆ విద్యార్థినికి ఆయన తన అభినందనలు తెలియజేశారు.

# అమిత్‌షా కాన్వాయ్‌పై దాడి హేయం



అమిత్‌షాపై దాడికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తిరుమల దైవదర్శనానికి విచ్చేసిన బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కాన్వాయ్‌పై దాడి హేయమైన చర్య అని బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి అన్నారు. అమిత్‌షా కాన్వాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టులాంటిదని ఆయన వ్యాఖ్యా నించారు. తెలుగుదేశం పార్టీవారు ఓట్ల రాజకీయాలు చేస్తూ గుండాయిజంతో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని, వారి అరాచకాలను ఖండిస్తున్నామని ఆయన అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ప్రజలు తప్పక గుణపాఠం చెప్తారని ఆయనన్నారు. అమిత్‌షా కాన్వాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ తొలుత జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి, ఆ ఘటనకు నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులోని జిల్లా బిజెపి కార్యాలయం నుంచి వివిఆర్‌సి కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. అనం తరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండ్ల ఈశ్వరయ్య, కప్పిర శ్రీనివాసులు, సుధాకరరెడ్డి, మొగరాల సురేష్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పొణకా దంపతులకు పరామర్శలు




పొణకా సరస్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, పారిశ్రామిక వేత్త పొణకా శివకుమార్‌రెడ్డి, మేజర్ శ్రీనివాసులురెడ్డి కుటుంబాన్ని పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ నెల 14వ తేదీన పరామర్శించారు. గూడూరు పట్టణంలో ఇటీవల మరణించిన పొణకా సరస్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

కాగా, నెల్లూరు సిటి ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ఈ నెల 12న పొనకా కుటుంబాన్ని పరామర్శించారు. సరస్వతమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈయన వెంట చేగువీరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

గూడూరు డివిజన్ వార్తలు



రామచంద్రయ్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యక్షుడు ఎ.శివకుమార్, శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, బాలసుందరశర్మ తదితరులు

# బ్రాహ్మణుల సమస్యలపై స్పందిస్తా!

**- బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు శివకుమార్**

పేదలను ఉన్నంతలో ఆదుకోవడం సంతోషంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అళఘునాథస్వామి దేవస్థానంలో బ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రామచంద్రయ్య అనే పేద బ్రాహ్మణుడికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పేదబ్రాహ్మణుల అభ్యున్నతికి సేవా సంఘం ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సేవ ద్వారా మనసుకు ఎంతో సంతృప్తి కలుగుతుందని తెలిపారు. ప్రతి నెలా సంఘం తరపున ఏదో ఒక సేవా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రావణకుమార్, కడివేటి రామమూర్తి, డి.బి.శ్రీనివాసరావు, రమణ, యువజన విభాగం అధ్యక్షుడు కె.బాలసుందరశర్మ, సిహెచ్ ప్రసాద్, బాలాజీ, దినకర్, జనార్ధన్ పాల్గొన్నారు.

# అవును... ఆయన చిత్రాలు మాట్లాడుతాయి

ప్రకృతిని ఆరాధించేవారికి తరచూ మంచి ఆలోచనలే వస్తుంటాయి. మనసును హత్తుకునే ప్రకృతి సోయగాలను అందరం వీక్షిస్తూనే ఉన్నా, వాటిని వర్ణచిత్రాలుగా, తైలవర్ణచిత్రాలుగా మార్చి మన మనసుల్లో కూడా వాటిని అదేవిధంగా ముద్రించగలిగే ప్రతిభ చిత్రకారుని సొత్తు. ఎంతో విలక్షణమైన, విశిష్టమైన చిత్రకళ అందరికీ వంటబట్టదు కూడా. ప్రకృతి ఆరాధన.. నిరంతర సాధన కలసి వెరసి పైడా వరప్రసాద్‌కు ఆ చిత్రకళ ఒక వరంగా మారింది. ఆయన వేసిన చిత్రాలు జీవకళతో తొణికిసలాడుతుంటాయి. ఆ చిత్రాలు మనతో మాట్లాడినట్లుంటాయి.






పైడా వరప్రసాద్... ఒక్క నెల్లూరుసీమ లోనే కాదు, రాష్ట్రస్థాయి చిత్రకళారంగంలోనూ ఆయన సుపరిచితులే. 'ప్రసాద్'గా కాకుండా, 'ఆర్టిస్ట్ ప్రసాద్' అంటే అందరికీ తెలుసు. చిత్రకారునిగా నెల్లూరీయులకు, ఇతర ప్రాంతాల వారికి ఎన్నో చిత్రాలను అందించి అందరి ప్రశంసలు అందుకున్నారాయన. ఆయన ఏ చిత్రం వేసినా అందులో జీవం ఉట్టిపడుతుంది. అది ప్రకృతి చిత్రమైనా, సామాజిక అంశమైనా ఏదైనా సరే.. ఆ చిత్రాలు అందరి దృష్టినీ ఆకర్షించే విధంగా ఉంటాయి. అందులోనూ ఎంతో కష్టసాధ్యమైన ఆయిల్ పెయింటింగ్స్ (తైలవర్ణ చిత్రాలు) వేయడంలో ఆయనకు ఆయనే సాటి. తనకంటూ ప్రత్యేకంగా గురువు లేకపోయినా, 'ప్రకృతే గురువుగా.. మనసే క్యాన్వాస్'గా చిత్రకళలో తనదంటూ అద్వితీయమైన కళాప్రతిభతో రాణిస్తూ, ఎంతో కళాత్మకంగా చిత్రాలను వేస్తూ అందరి అభినందనలు అందుకుంటున్నారు. తాను నేర్చుకున్న ఈ చిత్రకళను మరెంతోమంది బాలబాలికలకు, వర్ధమాన చిత్రకారులకు కూడా నేర్పుతూ నేటికీ చిత్రకళారంగానికి తనవంతు ప్రోత్సాహం అందిస్తున్నారు.

## 'ఆర్ట్...ఆయన హార్ట్'

చిన్ననాటి నుంచే చిత్రకళపై మక్కువతో కుంచెపట్టిన ప్రసాద్‌కు.. ఆర్ట్ అంటే ప్రాణం. ఒక్కమాటలో చెప్పాలంటే 'ఆర్ట్..ఆయన హార్ట్'. ప్రవృత్తిగా కాక, జీవితంలోనూ అదే వృత్తిగా స్వీకరించారు. ఆర్టిస్ట్‌గానే స్థిరపడ్డారు. నెల్లూరు ఆయన స్వస్థలం. తల్లిదండ్రులు పైడా శకుంతలమ్మ-పెంచలయ్య దంపతులకు 1958లో ప్రసాద్ జన్మించారు. చిన్నతనం నుంచే బొమ్మలు గీయడంలో ఆసక్తిని పెంచుకున్నారు. నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తన చిత్రకళను ప్రదర్శించి అందరి మెప్పు పొందారు. తాను వేసిన బొమ్మలు బావున్నాయని సాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ మెచ్చుకుంటుంటే, ఇక కళాకారునికి అంతకన్నా కావాల్సింది ఏముందీ?.. అంతే, పట్టిన పెన్సిల్ ఇక వదల్లేదు. ఆ తర్వాత అదే కుంచెగా మారింది. ఆ తర్వాత అదే ఆసక్తితో డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించి చిత్రకళలో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. నిరంతర సాధనతో.. కాలక్రమేణా మంచి చిత్రకారునిగా ఎదిగారు.

## కళాత్మక చిత్రాలకు పెట్టింది పేరు

అది వాటర్ కలర్ చిత్రమైనా, పెన్సిల్‌తో వేసిన రేఖా చిత్రమైనా, ఆక్రిలిక్స్ చిత్రమైనా, పెయింటింగ్ అయినా ఏదైనా సరే.. అలవోకగానే వేసి, ఆ చిత్రానికి జీవం పోయడం ఆయన ప్రత్యేకత. కళాత్మక చిత్రాలకు ఆయన పెట్టిందిపేరు. ఇరవైఏళ్ళ యువక ప్రాయంలోనే, 1978లో నెల్లూరులో 'ప్రసాద్ ఆర్టిస్ట్' పేరుతో చిత్రకళనే వృత్తిగా చేసుకుని రాణించారు. ఆయన వేసిన అనేక చిత్రాలు, పెయింటింగ్స్ నెల్లూరులోనే కాక, మద్రాసు వంటి నగరాల్లోని పెద్ద పెద్ద హోటల్స్‌వారు సైతం కొనుగోలు చేసేవారు. ఇప్పటికీ ఎంతోమంది ఇళ్ళలో ప్రసాద్ చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా అలంకరింపబడి ఉన్నాయి కూడా.

## చిత్రకళే శ్వాసగా.. ధ్యాసగా

తాను నేర్చుకున్న విద్యను పదిమందికీ తెలియజెప్పాలనే సదుద్దేశంతో ప్రసాద్ గత కొద్దికాలంగా ఎంతోమంది చిన్నారులకు, చిత్రకళ పట్ల ఆసక్తి ఉన్న పెద్దలకు కూడా చిత్రకళలో శిక్షణ ఇస్తూనే ఉన్నారు. ఇప్పటికే వేలాదిమంది బాలబాలికలకు ఆయన చిత్రాలు వేయడం నేర్పివున్నారు. గ్రామీణ విద్యార్థులకు పెయింటింగ్స్ పట్ల అవగాహన కలిగించేందుకు గతంలో మండల కేంద్రమైన కోటలో చిత్ర కళా ప్రదర్శన నిర్వహించారు. చిత్రకళే శ్వాసగా, ధ్యాసగా చేసుకుని, చిత్రకళా తపస్విగా నిరంతరం ఆ కళలోనే రాణిస్తూ.. ఎన్నెన్నో అత్యద్భుతమైన కళాత్మక చిత్రాలకు జీవం పోస్తూ చిత్రకళారంగంలో సింహపురి కీర్తిని దశదిశలా చాటుతూ 'ఆర్టిస్ట్ ప్రసాద్' అందరి అభినందనలు అందుకుంటున్నాడు.

**జనసేన ఆధ్వర్యంలో**

# ఓటర్ల నమోదు



గూడూరు పట్టణంలోని సాధుపేట ప్రాంతంలో జనసేన పార్టీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ యువత అధ్యక్షులు నయీమ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. అర్హతగల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలో మునిగిరీష్, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో 33వార్డులలో తిరిగి ఓటరుగా నమోదు కానివారిని నమోదు చేయిస్తామని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు నవీన్, ఇస్మాయిల్, మున్నా, ఖలీల్, సాయి, రఫి, హరి తదితరులు ఉన్నారు.

# పథకం ప్రకారమే హత్య

ఏప్రిల్ 20వ తేదీ గూడూరులోని బ్లూ డైమండ్ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గూడూరు మండలం, చెంబడిపాలెంకు చెందిన వడ్ల దళారీ వ్యాపారి పురిణి రవి హత్య కేసును పోలీసులు ఛేధించారు. పథకం ప్రకారమే రవిని హత్య చేసినట్లుగా పోలీసులు తేల్చారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరచిన రూరల్ సి.ఐ అక్కేశ్వరరావు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, డిఎస్పీ వి.ఎస్.రాంబాబులు అభినందించారు.

గల్పిక

# బాబు దీక్షపై కేంబ్రిడ్జిలో పరిశోధనలు

అది లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం. ఎం.ఏ లిట్ క్లాస్‌రూమ్... ప్రొఫెసర్ మార్గరెట్ హల్వా క్లాస్‌కు అటెండయ్యి రాజకీయాలలో నిరాహారదీక్షల పాత్ర అనే సబ్జెక్ట్‌పై లెసన్ మొదలుపెట్టింది. దీక్షలో ఎన్ని రకాలు, ఎన్నిరోజులు చేస్తారు అని ఆమె వివరిస్తుండగా ఫిలిప్‌పాల్‌కోవా అనే స్టూడెంట్ లేచి... మేడమ్ ఇండియాలో ఇటీవల కొందరు నాయకులు తరచూ దీక్షలు చేస్తున్నట్లు చదువుతున్నాం... ఆ దీక్షల గురించి చెప్పండి అని కోరాడు. అందుకు మార్గరేట్ హల్వా... చెప్పడం ఎందుకు చూపిస్తాను అంటూ ఒక స్క్రీన్ ఏర్పాటు చేయించి భారతదేశ చరిత్రలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, కేసీఆర్, జగన్ వంటి వాళ్ళు చేసిన దీక్షలను చూపించింది. అది చూసి ఫిలిప్‌పాల్‌కోవా... మేడమ్, వీటిలో ఏ దీక్షయినా గిన్నిస్ రికార్డుకెక్కిందా? అని అడిగాడు. గిన్నిస్‌రికార్డుకు అవి అర్హత సాధించలేదు. ఈ దీక్ష మాత్రం అర్హత సాధించింది అని స్క్రీన్‌పై చంద్రబాబు 12గంటల దీక్షను ఆన్ చేసింది.

★★★★★

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్... అక్కడ హాల్‌లో తెలుగుదేశం ఎంపీలు మురళీమోహన్, గల్లా జయదేవ్, మాగంటి బాబు, జేసీ దివాకర్‌రెడ్డి, సీఎం రమేష్, సుజనాచౌదరిలు కూర్చుని వున్నారు. అప్పుడే రాష్ట్రపతి కార్యదర్శి అక్కడకు వచ్చి... సార్ రమ్మంటున్నారు అని చెప్పాడు. అందరూ రాష్ట్రపతి ఛాంబర్‌లోకి వెళ్లారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారిని సాదరంగా ఆహ్వానించి కూర్చోమని, విషయం ఏంటని అడిగాడు. సుజనాచౌదరి ఒక ఆహ్వానపత్రికను రాష్ట్రపతి చేతిలో పెట్టి తప్పకుండా రావాల్సార్ అని అడిగాడు. వస్తారు సరే... ఏంటిది అని అడిగాడు. అప్పుడు మురళీ మోహన్.. మా నాయకుడు చంద్రబాబునాయుడు ప్రత్యేకహోదా కోసం విజయవాడలో 12గంటల నిరాహారదీక్ష చేస్తున్నాడు సార్. ఆ దీక్షకు రావాలని చెప్పి అందర్నీ కార్డులు కొట్టి ఆహ్వానిస్తున్నాం. మంచి ఈవెంట్ సార్, మిస్ కావద్దు... మంచి ఫుడ్డు ఉంటుంది. అరగంటకోసారి మజ్జిగ, కూల్‌డ్రింక్స్, స్నాక్స్ వుంటాయి. ఇక ఎండ సెగ అన్నదే తగలకుండా చుట్టూ ఏసిలుంటాయి. మీకు హిమాలయాల్లో వున్నట్లే వుంటుంది. ఇక 12గంటల పాటు బోర్ కొట్టకుండా వుండేందుకు రకుల్‌ప్రీత్‌సింగ్, కాజల్, తమన్నా, అనుష్కలచే నృత్యప్రదర్శనలు, ఇళయరాజా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంలచే సంగీత విభావరి, చమ్మక్ చంద్ర, హైపర్ ఆది, బుల్లెట్ భాస్కర్, సుడిగాలి సుధీర్, అనసూయలచే జబర్దస్త్ ప్రోగ్రామ్‌లుంటాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, జపాన్ ప్రధాని షింజో అబే, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో పాటు ఇంకా పలు దేశాల ప్రతినిధులు, మన దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వస్తున్నారు. ఇలాంటి దీక్ష మీరు చరిత్రలో ఎప్పుడు చూసి వుండరు. ప్రపంచ దేశాధినేతలందరు కూడా చంద్రబాబు దీక్ష చేస్తున్నారనే సరికి ఇందులో ఏదో వెరైటీ వుంటుందనుకుని అందరూ అదిపనిగా వస్తున్నారు. మీరు గంట ముందే వచ్చి కూర్చోండి, లేకపోతే సీట్లు దొరకడం కష్టం అని చెప్పాడు. రామ్‌నాథ్‌కోవింద్ అయోమయంగా... నిరాహారదీక్షకు ఇంత సీనా అని మనసులో అనుకుంటూ అలాగే వస్తానని వాళ్ళకు చెప్పాడు. ఢిల్లీలో ఇంకా పిలవాల్సినవాళ్ళు చాలామంది ఉన్నారాసార్ అంటూ అందరూ అక్కడనుండి లేచారు.

★★★★★

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం... వేదిక మీద, వేదిక ముందు ఎక్కడ పట్టినా ఏ.సి మిషన్‌లే... బండలు పగిలే రేంజ్‌లో కాస్తున్న ఎండల దెబ్బకు దారినపోయే జనాలు కూడా అక్కడ కూర్చుని సేదతీరసాగారు. అక్కడే భోజనం, స్నాక్స్, మజ్జిగ, కూల్‌డ్రింక్స్ ఇస్తుండడంతో పనులకు పోయేవాళ్ళు కూడా మానుకుని అక్కడే కూర్చుండిపోయారు. దేశ విదేశాల ప్రతినిధులందరూ వచ్చి విఐపి సీట్లలో కూర్చున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులు కూడా వచ్చి తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసం నుండి భారీ ర్యాలీతో సభా ప్రాంగణానికి వచ్చారు. వచ్చిన అతిథులందరితో కరచాలనం చేస్తూ ఆయన వేదికపైకి వెళ్లారు. తర్వాత చైనా ప్రధాని జిన్‌పింగ్, సింగపూర్ ప్రధాని లీ సేన్ లూంగ్‌లను వేదికపైకి ఆహ్వానించారు. వారిద్దరి చేత వేదికమీద జ్యోతిప్రజ్వలన కార్యక్రమం పెట్టారు. అది ముగియగానే వర్ల రామయ్య మైకు పట్టుకుని... ఇప్పుడు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులు వేదికమీదకొచ్చి చంద్రబాబు గారికి చెరో చెంబు బత్తాయి జ్యూస్ తాగించి దీక్షను ప్రారంభిస్తారని ప్రకటించాడు. ఆ మాటకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఎవరన్నా దీక్ష విరమించేటప్పుడు జ్యూస్ తాగిస్తారు. దీక్ష మొదలుపెట్టేటప్పుడు ఈ జ్యూస్ తాగించడమేంటి... అది కూడా చిన్నగ్లాస్ కాదు, చెంబుడంత అనుకుంటూ ఇద్దరూ వేదికపైకి వెళ్ళి చంద్రబాబుకు చెరో చెంబు జ్యూస్ తాపించారు. దాంతో ఆ నిముషం నుండి దీక్ష మొదలైనట్లయ్యింది. ఇక పక్కనే ఏర్పాటు చేసిన వేదికపై సినీ యాక్టర్ల డ్యాన్స్‌లు, కామెడీ షోలు, సంగీత విభావరి కార్యక్రమాలు యధావిధిగా జరగసాగాయి. స్టేజీమీదున్నోళ్లకి, స్టేజీ ముందున్నోళ్లకు గ్యాప్ లేకుండా జ్యూస్‌లు, ఆహార పొట్లాలు అందించసాగారు. ఈలోపు నాయకులు వేదికమీదకెక్కి స్పీచ్‌లు దంచసాగారు. టైం దండిగా వుండడంతో ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ప్రసంగాలలో తమ టాలెంట్ చూపసాగారు. నిరాహారదీక్ష చేయడంలో గాంధీ, పొట్టి శ్రీరాములు, కేసీఆర్‌లు చంద్రబాబు ముందు దిగదుడుపేనన్నట్లు మాట్లాడసాగారు. అప్పుడే సభా ప్రాంగణంలోకి లోకేష్ వచ్చాడు. అతని చేతిలో '30రోజుల్లో తెలుగుభాష' అనే పుస్తకం వుంది. అది చూడగానే చంద్రబాబు గుండె గతుక్కుమంది. వెంటనే పక్కనేవున్న మంత్రి నారాయణను పిలిచి... లోకేష్ వేదికపైకి వచ్చి మాట్లాడతాడేమో... అతని చేతిలో వున్న బుక్‌ను చూస్తుంటే భయమేస్తుంది... అసలే ఈరోజు నా బర్త్‌డే... వాడేం మాట్లాడతాడో తెలీదు... కాబట్టి స్టేజీ ఎక్కకుండా చెయ్ అని బ్రతిమలాడాడు. నారాయణ 'మైహూనా' అంటూ చంద్రబాబుకు హామీ ఇచ్చాడు. అంతలో వూహించని విధంగా బాలకృష్ణ స్టేజీ ఎక్కి మైకందుకున్నాడు. తనదైన శైలిలో ప్రసంగం మొదలుపెట్టాడు. రామ్‌నాథ్ కోవింద్‌ను చూస్తూ... హిందీలో... "మోడీ మన్‌కే బాద్... హమారీ దిల్‌కేధడక్" అంటూ కట్ హిందీ మాట్లాడాడు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అర్థం కావాలని చైనీస్ భాషలో... "చుంగే చాంగ్ చుప్‌కీ లక్‌చక్ వాంగ్ జులాంగ్ లపాంగ్" అని మాట్లాడాడు. జపాన్ ప్రధాని షింజో అబేకు అర్థం కావాలని కొద్దిసేపు "మికీచువా చమ్లి చివో చెమ్మామ ఇఫినే మిత్సుబిషి హోండా ఒనిడా" అంటూ మాట్లాడాడు. బాలకృష్ణ అన్ని భాషలు మాట్లాడడం చూసి చంద్రబాబుకే మైండ్ బ్లాక్ అయ్యింది. అక్కడే వున్న దేవినేని ఉమను పిలిచి మా బాలయ్య అన్ని భాషలు మాట్లాడుతున్నాడు, ఇవన్నీ ఎక్కడ నేర్చుకున్నాడు అని అడిగాడు. నోట్లో నుండి ఇతర భాషలు బయటకు రావాలంటే చదువుకోబల్లేదు సార్ అంటూ దేవినేని వెళ్ళిపోయాడు. చంద్రబాబుకు ఆ మాట అర్థం కాక బుర్రగోక్కోసాగాడు. అంతలో సాయంత్రం 7గంటలయ్యింది. వర్ల రామయ్య మైకందుకుని చారిత్రాత్మకమైన చంద్రబాబు గారి దీక్ష ముగిసిందని ప్రకటించాడు.

★★★★★

ఇక్కడితో స్క్రీన్ మీద సీన్‌లు అయిపోయాయి. తర్వాత ప్రొఫెసర్ మార్గరేట్ హల్వా విద్యార్థులనుద్దేశించి ప్రపంచ చరిత్రలో ఇంతవరకు గిన్నీస్‌బుక్ రికార్డు సృష్టించిన దీక్ష ఇదే! దాదాపు 30కోట్లు ఖర్చుపెట్టిన దీక్షగా ఇది రికార్డుల్లోకెక్కింది. ఈ దీక్షపై మీరు పరిశోధనలు చేయగలరా? అని ఆమె ప్రశ్నించింది. వెంటనే విద్యార్థులు... మూకుమ్మడిగా మేము చేస్తాం... మేము చేస్తాం... అంటూ చేతులు పైకెత్తారు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ నిర్వహణలో జాగ్రత్త వహించండి. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. షేర్లు, పెట్టుబడులు నిరుత్సాహం కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ పెట్టండి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం, ఆర్థి కావకాశాలు తగ్గిపోవడం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. వస్తువులు, డబ్బు జాగ్రత్తగా పెట్టుకొనండి. ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభవార్తలు వింటారు. దైవకార్యాలలో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయంలో పనులు ఆలస్యం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లు ఖర్చులు, ప్రయాణ ఖర్చులు బాగుంటాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించండి. విద్యా ప్రగతి బాగుంటుంది. చేసే కృషికి తగ్గట్లుగా ఆర్థికస్థితి ఉండదు. ఖర్చులు బాగా పెరిగిపోతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆరోగ్యం విషయంలో జాగ్రత్త. శరీరానికి గాయాలు తగలవచ్చును. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంతవరకు లభించడం జరుగుతుంది. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. కుటుంబసౌఖ్యం, విద్యార్థులకు విద్యావృద్ధి బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలను సమర్ధవంతంగా జరుపుతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అవసరాలకు ఋణం చేయడం, బంధువులతో సత్సంబంధాలు గట్టి పరచుకోవడం ఉంటుంది. శుభవార్తలు వింటారు. షేర్లు పెట్టుబడుల మీద లాభాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి కొద్దిగా పెరుగుతుంది. ఉపాధి పథకాలలో నిద్రొక్కుకుంటారు. కళా క్రీడా శాస్త్ర వైద్య రంగాలవారికి పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అనుకున్న పనులు ఆలస్యంగా జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అధికారవర్గ అనుకూలత ఉంటుంది. కోర్టు వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. శుభకార్య ప్రయత్నాలు, అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. కుటుంబంలో చిన్నచిన్న విషయాల వల్ల అభిప్రాయభేదాలుంటాయి. కాబట్టి సర్దుకొని పోవాలి. బిడ్డల వల్ల ఖర్చులు, కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

రావలసిన బాకీలు లభించడం, స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. హామీలు ఇవ్వడం, రిస్క్ తీసికొనడం చేయవద్దు. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. కాని మనస్సుకు కొరతగా అనిపిస్తుంది. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలుంటాయి. పనులందు టెన్షన్ ఎక్కువ ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 18.5.2018 నుండి
తేది. 24.5.2018 వరకు

ఈ వారం మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, మేషంలో బుధుడు, వృషభంలో రవి, మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజకేతువులు సంచరిస్తారు.

**పంచాంగము :**
అధిక జ్యేష్ఠ మాసము జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

### అధికజ్యేష్ఠ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | తదియ | ప॥ గం.11.43వ॥ |
| తేది. 19 | శని | చతుర్ది | ఉ॥ గం.9.20వ॥ |
| తేది. 20 | ఆది | పంచమి | ఉ॥ గం.6.25వ॥ |
| | పిదప | షష్ఠి | రా॥ గం.4.25వ॥ |
| తేది. 21 | సోమ | సప్తమి | రా॥ గం.2.03వ॥ |
| తేది. 22 | మంగళ | అష్టమి | రా॥ గం.11.53వ॥ |
| తేది. 23 | బుధ | నవమి | రా॥ గం.9.57వ॥ |
| తేది. 24 | గురు | దశమి | రా॥ గం.8.21వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా పెరుగుదలకు చేసే పనులన్ని కలిసివస్తాయి. ఆదాయము పెరుగుతుంది. సోదరవర్గానికి అభివృద్ధి ఉంటుంది. పన్నులు, బాకీలు చెల్లిస్తారు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు, ప్రభుత్వ సహకారం ఉంటుంది. కొత్త పథకాలు ప్రణాళికలు అమలు చేస్తారు. ఆకర్షణలకు వత్తిడులకు లొంగవద్దు. దూర ప్రయాణాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధు ముఖ్యులతో మాట పట్టింపు విరోధాలుంటాయి. జీవిత సహచరులకు ఆరోగ్య లోపం ఉండవచ్చును. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల వల్ల ఇబ్బందులు కలుగవచ్చును. గృహ వస్తు రిపేర్లుండవచ్చును. శ్రమతో అనుకున్న పనులు జరుపుకొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక నిర్ణయాలలో పొరపాట్లు రాకుండా జాగ్రత్తపడండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలు నిర్ణయం కావచ్చును. దైవ సేవలు, సభలలో పాల్గొంటారు. కొత్త కాంట్రాక్టులు అగ్రిమెంట్లు, లీజులకు అవకాశాలు రాగలవు. కుటుంబ సమస్యలను రాజీ మార్గంలో సర్దుబాటు చేయగలరు. వాణిజ్య వృద్ధికి మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు నెరవేర్చుకొంటారు. రావలసిన బాకీలు కొంత చేతికందడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కళాక్రీడా మార్కెటింగ్ రంగాల వారికి ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి. గృహోపకరణాలు విలువైన వస్తువులు చేకూరుతాయి. దైవకార్యాలలో పాల్గొనడం, సహాయపడడం జరుగుతుంది. దూర ప్రయాణాలుంటాయి. శుభవార్తలు వింటారు. ఉద్యోగార్థులకు ప్రయత్నాలు ఫలించవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక వ్యవహారాలను సొంతంగా అజమాయిషీ చేస్తారు. పెట్టుబడులకు అవకాశాలు, షేర్ల మీద లాభాలుంటాయి. కొత్త వారితో పరిచయాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయ ప్రయత్నాలు జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఉద్యోగ బాధ్యతలు పెరిగి విశ్రాంతి తగ్గుతుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొన్ని అదనపు ఖర్చులు నుండి తప్పించుకొనలేరు. దైవ సేవ, దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. పనులు చేపట్టినవి నిదానంగా జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులలో జాప్యం జరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభవార్తలు వింటారు. బంధు ముఖ్యులను ఆత్మీయులను కలుసుకొంటారు. నిరుద్యోగులకు అవకాశాలు, ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

# ఔరా.. విధి!

## భార్గవ్ ఆర్ట్స్ భార్గవ్‌రెడ్డి విషాద మరణం



విధి చాలా విచిత్రమైనదే కాదు... ఒక్కోసారి కిరాతకమైనది కూడా! అప్పుడప్పుడు కొందరి పట్ల చాలా కటువుగా వ్యవహరిస్తుంది. ఒకే కుటుంబం మీద పగ పెంచుకున్నట్లుగా వుంటుంది. ఎంతో వెలుగు వెలిగిన కుటుంబాన్ని ఉఫ్‌మంటూ ఆర్పేస్తుంది. విధి రాత విసిరిన పాశానికి బలైపోయిన ఆ కుటుంబమే సన్నారెడ్డి గోపాలరెడ్డి కుటుంబం.

సన్నారెడ్డి గోపాలరెడ్డి అంటే ఎవరు? అనే సంశయం వస్తుంది. భార్గవ్ ఆర్ట్స్ అధినేత ఎస్.గోపాల్‌రెడ్డి అంటే ఆంధ్ర, తెలంగాణలో ఎవరైనా ఇట్టే గుర్తుపట్టేస్తారు హిట్ సినిమాల నిర్మాత అని! ఏ భార్గవ్ ఆర్ట్స్ పేరుమీదైతే... తెలుగు సినీ ప్రేక్షక లోకానికి మంగమ్మ గారి మనుమడు, ముద్దుల కృష్ణయ్య, ముద్దుల మామయ్య, మువ్వగోపాలుడు, మాపల్లెలో గోపాలుడు, మన్నెంలో మొనగాడు, మురళీకృష్ణుడు వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించారో... ఆ భార్గవ్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన వాకాడు మండలం పంబలి వద్ద సముద్రంలో మృతదేహమై తేలాడు. సముద్రపు అలల నుండి తన పెంపుడు కుక్కను రక్షించుకునే ప్రయత్నంలో ఆయన కూడా మృత్యువాతపడ్డట్లుగా తెలుస్తోంది.

వాకాడు మండలం గునుపాటిపాలెంకు చెందిన ఎస్.గోపాల రెడ్డి తొలుత సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా వున్నారు. ఆ తర్వాత చలనచిత్ర పరిశ్రమలోకి ప్రవేశించి నిర్మాతగా మారి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. నెల్లూరోళ్ళకు సినీ రంగం కలిసిరాదనే సెంటిమెంట్ వున్నరోజుల్లో 'ఖైదీ' చిత్ర నిర్మాణం ద్వారా నెల్లూరుకు చెందిన నిర్మాత ఎం.తిరుపతిరెడ్డి మెగాస్టార్ చిరంజీవికి బ్రేక్ ఇస్తే, భార్గవ్ ఆర్ట్స్ ప్రొడక్షన్‌లో ఎస్.గోపాల్‌రెడ్డి నిర్మించిన 'మంగమ్మగారి మనుమడు' చిత్రం బాలకృష్ణ సినీ జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. బాలకృష్ణకు మొదటి బిగ్గెస్ట్ హిట్ సినిమా ఇదే! సినీ పరిశ్రమలో ఎన్నో విజయాలను సాధించిన గోపాల్‌రెడ్డి వ్యక్తిగత జీవితంలో మాత్రం ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. విధి చేతిలో తలవంచుతూ వచ్చాడు. కొన్నేళ్ళ క్రితం ఆయన భార్య క్యాన్సర్ వ్యాధితో మరణించగా, కొద్దికాలానికే తన సతీమణి లేదన్న మానసిక వ్యాధితో ఆయన కూడా మృత్యుఒడికి చేరాడు. వారి ఒక్కగానొక్క కూతురు సంసార జీవితంపై ఆసక్తి లేక సన్యాస జీవితాన్ని స్వీకరించింది. కాగా, ఇప్పుడు మిగిలివున్న కొడుకు భార్గవ్‌రెడ్డిని సముద్రం మింగేసింది. 'మురారి' అనే సినిమాలో చూపించినట్లు కుటుంబానికి కుటుంబమే ఏదో శాపానికి గురైనట్లుంది. గోపాలరెడ్డి ఎన్నో సినిమాలు తీసారు. కాని ఆయన కుటుంబంలో ఎదురైన సంఘటనలను మించిన విషాద చిత్రం ఇంకోటి ఉండదేమో!

ఏదేమైనా నెల్లూరీయులు గర్వించదగ్గ సినిమా నిర్మాత గోపాల్‌రెడ్డి. గతంలో ఆయన, నేడు ఆయన కొడుకు భార్గవ్ మరణం తీరని విషాదం. భార్గవ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటోంది 'లాయర్'.

# బిందుమీనన్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు



నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి, ప్రముఖ న్యూరాలజిస్ట్, డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బిందుమీనన్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. వైద్యరంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, న్యూరాలజీ విభాగంలో తనదైన సేవలను అందిస్తున్న డాక్టర్ బిందుమీనన్‌కు వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ వారు వ్యక్తిగత విభాగంలో వరల్డ్ స్ట్రోక్ అవార్డును ప్రధానం చేశారు. డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్, డాక్టర్ బిందుమీనన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్‌లో ఓ భాగమైన వరల్డ్ స్ట్రోక్ ప్రచార కమిటి ఛైర్మన్ జాన్ బారిక్ మాట్లాడుతూ పక్షవాతంతో బాధపడే రోగులకు చికిత్సలు అందించడంలో ప్రతిభ కనబరిచి, రోగుల కోసం చిత్తశుద్ధితో కృషిచేసిన వారిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నామన్నారు.


## 13వ వర్ధంతి




శ్రీమతి కనుపర్తి రమాదేవి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటి దీపం

మా అమ్మను స్మరిస్తూ...

కుమారులు - కోడళ్లు
కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన
మృదుల - వెంకటేష్
మునిమనుమరాలు - అద్విత
కనుపర్తి దయాశంకర్ - రేణుక
నితిన్ , రమానందిక

కుమార్తెలు - అల్లుళ్లు
సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి
మానస, మౌనిక
జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహాశర్మ
మేఘున, కౌశిక్


# శ్రీధర్‌రెడ్డి బైక్ ర్యాలీ

- జగన్ 2000 కి.మీ పాదయాత్రకు సంఘీభావం



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 2000 మోటార్‌బైక్‌లతో భారీర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు పార్టీ జెండాలు చేతపట్టుకుని 2000 బైక్‌లలో వెంట రాగా, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముందుకు సాగారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గా నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఎస్పీ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండ్, మద్రాస్‌బస్టాండ్, విఆర్‌సి కూడలి మీదుగా గాంధీబొమ్మ వద్దకు చేరుకుంది.

ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం, సమస్యల అధ్యయనం కోసం వై.యస్. జగన్ పాదయాత్ర సాగిస్తూ 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకోవడం రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక కీలక ఘట్టమన్నారు. వై.యస్. జగన్ పాదయాత్రకు లభిస్తున్న అపూర్వ ప్రజాదరణ రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఘనవిజయానికి సంకేతమన్నారు. ముఖ్యంగా గత ఎన్నికల్లో టీడీపీ అత్యధిక సీట్లు సాధించిన గోదావరి జిల్లాలో జగన్ పాదయాత్రకు లభిస్తున్న అపూర్వ ప్రజాస్పందన టీడీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేకతకు, జగన్ పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.


# పోలీసు అధికారులకు సన్మానం



నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను త్వరగా వచ్చేలా కృషి చేస్తానన్నారు. పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాద్‌రావు మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి ఎస్పీ ఎంతో కృషి చేసారని, పిల్లల చదువులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఉన్నత చదువులు చదివించేందుకు పాటుపడ్డారన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్సై రాంబాబు, ఏఆర్ ఎస్సైలు దశరథరామయ్య, గోవర్ధన్‌రావులను సన్మానించారు. ఏఎస్పీ శరత్‌బాబు, ఓఎస్డీ టి.పి.విఠలేశ్వర్, అసోసియేషన్ నాయకులు గంగాధర్, కార్యదర్శి వేణు, నాయకులు తురకా శ్రీనివాసులు, పరమేశ్వరి, రమణయ్య, డిఎస్పీలు, సి.ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## కాలధర్మం

### డాక్టర్ వేణుంబాక శ్రీనివాసులురెడ్డి



చెన్నై అపోలో ఆసుపత్రిలో 40ఏళ్ళ పాటు కంటి వైద్యులుగా లక్షలాది మందికి విశేష వైద్యసేవలందించిన డాక్టర్ వేణుంబాక శ్రీనివాసులురెడ్డి ఈ నెల 12వ తేదీన స్వర్గస్థులయ్యారు. ఆయన వయసు 78 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. కొడుకు, ఒక కుమార్తె అమెరికాలో ఉద్యోగరీత్యా వుండగా, ఇంకో కుమార్తె చెన్నైలో వుంటున్నారు.

ఇందుకూరుపేట మండలంలోని మైపాడు వారి స్వగ్రామం. వారి తండ్రి వేణుంబాక నరసారెడ్డి కాంట్రాక్టర్‌గా వుంటూ నెల్లూరులో స్థిరపడ్డారు. వేణుంబాక శ్రీనివాసులురెడ్డి కాకినాడలో వైద్య విద్యను అభ్యసించి 1966లో లండన్‌కు వెళ్ళారు. 1985 వరకు డాక్టర్‌గా విశేష అనుభవం గడించారు. 1986 నుండి 2014 వరకు చెన్నై అపోలో ఆసుపత్రిలో ఆప్తమాలజిస్ట్‌గా వైద్యసేవలందించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



నెల్లూరుజిల్లాలో బలమైన రాజకీయ కుటుంబానికి చెందిన ఆనం రామనారాయణరెడ్డి ఇప్పుడు వినూత్న సమస్యలో చిక్కుకుని వున్నాడు. తన రాజకీయ భవిష్యత్ దృష్ట్యా ఎటువైపు అడుగులు వేయాలో తెలియని సందిగ్ధ స్థితిలో ఉన్నాడు.

# అయోమయంలో ఆనం

ఇటీవలే ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంపార్టీని వీడుతున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి బలమిచ్చేలా రామనారాయణ రెడ్డి వ్యవహారశైలి కూడా వుండింది. తన మరణానికి ముందు ఆనం వివేకానందరెడ్డి తన తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డితో... మనం దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి కుటుంబం పట్ల తప్పు చేసామని, టీడీపీలో చేరి పొరపాటు చేసామని ఇక ఈ పార్టీలో వుండొద్దని చెప్పినట్లు బయటకు పొక్కడం తెలిసిందే! దీనికి తగ్గట్లుగానే ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరనున్నాడని, ఆత్మకూరు లేదా వెంకటగిరిలలో ఒక సీటు ఆయనకు ఇవ్వొచ్చని కొద్ది రోజుల క్రితం ప్రచారం జరిగింది. వివేకా ఆసుపత్రిలో వున్నప్పుడు పరామర్శించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళితే కూడా రామనారాయణరెడ్డి అక్కడ వుండకుండా వచ్చేసాడు. పార్టీ మారాలను కున్నాడు కాబట్టే సీఎం ముఖం చూడడానికి ఇష్టపడలేదని ఆరోజు అందరూ అనుకున్నారు.

అయితే ఆ తర్వాత ఆనం కుటుంబంలో ఎలాంటి రాజకీయ పరిణామాలు సంభవించలేదు. వైసిపి నుండి క్లియరెన్స్ లేకపోవడంతో ఆయన ఆ పార్టీలో చేరలేదు. ఈలోగా వివేకా స్వర్గస్థులు కావడం, ఏప్రిల్ 25వ తేదీన నెల్లూరులో జరిగిన ఆయన అంత్యక్రియలకు చంద్రబాబు రావడం, ఆనం కుటుంబ సభ్యులతో సమావేశమై పరామర్శించడం జరిగాయి. ఇటీవల అమరావతిలో జరిగిన నెల్లూరు లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌ల సమావేశానికి కూడా ఆనం రామనారాయణరెడ్డి హాజరు కాలేదు. కాని ఆ సమావేశంలో చంద్రబాబు మాత్రం రామనారాయణరెడ్డి వ్యక్తిగత కారణాల వల్ల రాలేదని, ఆనం కుటుంబం మనతోనే వుంటుందని జిల్లా నాయకులకు చెప్పడం జరిగింది. ఇంతవరకు అయితే ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలోనే వున్నాడు. టీడీపీ నాయకత్వం కూడా ఆయనను పార్టీలో నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఆత్మకూరుకు ఆయన్నే అభ్యర్థిగా ప్రతిపాదిస్తోంది.

అయితే ఇక్కడ ఆనం అనుచరుల పరిస్థితి ఇంకోరకంగా వుంది. ఆత్మకూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా అయితే గెలవలేమని వాళ్ళు రామనారాయణరెడ్డితోనే చెబుతున్నారు. ప్రజల్లో మీరంటే అభిమానం వుంది, అదే సమయంలో తెలుగుదేశం ప్రభుత్వంపై వ్యతిరేకత వుంది. ఈ పార్టీలో వుంటే కష్టం. వైసిపిలోకి పోదామని ఒత్తిడి తెస్తున్నారు. అయితే వైసిపి నుండి ఎటువంటి హామీ లేకుండా పార్టీ మారాలనే ఆలోచనలో ఆయన లేడు. ఇప్పుడు తెలుగుదేశం అభ్యర్థిగా ఆత్మకూరు కంటే కూడా ఉదయగిరిలో పోటీ చేయాలని ఆ ప్రాంత నాయకులు ఆనంను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఉదయగిరి ప్రాంతంలోనూ ఆనం రామనారాయణరెడ్డికి మంచి పేరుంది. ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ఆత్మకూరుకే కాక ఉదయగిరి ప్రాంతానికి కూడా సోమశిల హైలెవల్ కెనాల్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేసి పెట్టాడు. అదీగాక ఈ నియోజకవర్గానికి కొత్త నాయకుడవుతాడు. నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో సత్సంబంధాలున్నాయి. ఈ దృష్ట్యా టీడీపీలోనే వుంటే ఆయనకు ఉదయగిరి బెటర్ అనే అభిప్రాయం వినపడుతోంది.

ప్రస్తుతానికైతే ఆయన రాజకీయ ఊగిసలాటలో వున్నట్లే! ఎలక్షన్‌లో పనిచేయాల్సిన అనుచరులే టీడీపీ నుండి అయితే ఆత్మకూరులో మనం ఓడిపోతామని పదేపదే చెబుతుంటే ఎవరైనా వెనకడుగు వేయాల్సిందే! అలాగని వైసిపి వాళ్ళు పిలవకుండా ఆ పార్టీలోకి పోలేదు. ఇంకొన్ని నెలల పాటు ఆనం రామనారాయణకు ఈ అయోమయ పరిస్థితి తప్పకపోవచ్చు.

# విరిసిన కమలం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, జేడీఎస్‌ల కంటే వెనుకబడి వున్నాడన్న నియోజకవర్గాలపై పెద్దగా దృష్టి పెట్టలేదు. గెలుపు ఖాయమనుకున్న స్థానాలతో పాటు రెండో స్థానంలో వున్నామని రిపోర్ట్ వచ్చిన స్థానాలపై ప్రత్యేకదృష్టి పెట్టారు. కాబట్టే కాంగ్రెస్ కంటే మొత్తంగా ఓట్లు తగ్గినా సీట్ల పరంగా మొదటి స్థానంలో నిలవగలిగారు. కేవలం వ్యూహాత్మక రాజకీయాలతోనే బీజేపీ పెద్ద పార్టీగా నిలిచింది.

దేశమంతటా ఉత్కంఠ రేపిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 15వ తేదీ వెలువడ్డాయి. పలు సర్వే సంస్థలు ఊహించినట్లే హంగ్ ఫలితాలు వచ్చి కర్నాటకలో అధికార కుర్చీ ఆట మొదలైంది. బీజేపీకి 104 సీట్లు వచ్చి పూర్తి మెజార్టీకి 8సీట్ల దూరంలో ఆగింది. ఇక అధికార కాంగ్రెస్ 78సీట్లతో రెండో స్థానానికి పరిమితం కాగా, జేడీఎస్ 38సీట్లు గెలుచుకుని ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారింది. ఫలితాల సరళినిబట్టి ఒక దశలో బీజేపీ పూర్తి మెజార్టీ సాధిస్తుందనుకున్నప్పటికీ చివరిలో కాంగ్రెస్ పుంజు కోవడంతో బీజేపీ అధికారానికి 8సీట్ల దూరంలో ఆగింది.

**అప్రమత్తమైన కాంగ్రెస్...**

హంగ్ ఫలితాలు వచ్చాయని తెలియగానే కాంగ్రెస్ అప్రమత్తమైంది. గతంలో గోవా, నాగాలాండ్, మణిపూర్ వంటి రాష్ట్రాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. సోనియాగాంధీనే నేరుగా జేడీఎస్ అధినేత దేవేగౌడకు ఫోన్ చేసి కుమారస్వామిని ముఖ్య మంత్రిని చేస్తామని ప్రతిపాదించింది. దీంతో జేడీఎస్ కూడా కాంగ్రెస్‌తో చేతులు కలపడానికి సై అంది. కాంగ్రెస్, జేడీఎస్‌లు కలిస్తే ప్రభుత్వం ఏర్పాటు సులభమే!

**రేవణ్ణకు బీజేపీ ఆఫర్...**

అయితే బీజేపీ కాంగ్రెస్‌కు ఛాన్స్ ఇస్తుందా? కాంగ్రెస్ కుమారస్వామికి గాలం వేస్తే బీజేపీ దేవేగౌడ్ పెద్దకొడుకు రేవణ్ణకు వల విసిరింది. జేడీఎస్‌లో కుమార స్వామి, రేవణ్ణ వర్గాలు వేర్వేరుగా వున్నాయి. తమ్ముడు సీఎం అవుతుంటే అన్న రేవణ్ణ చేతులు ముడుచుకుని వుంటాడా? బీజేపీ వాళ్ళు రేవణ్ణలో పదవీ ఆకాంక్షను రగిల్చే ప్రయత్నం చేస్తున్నారు. కర్నాటక డిప్యూటీ సీఎం లేదా కేంద్రమంత్రి పదవి ఆఫర్ చేస్తున్నారు. దీంతో పాటు కాంగ్రెస్‌లో వున్న లింగాయత్ కులానికి చెందిన ఎమ్మెల్యేలను చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. జేడీఎస్, కాంగ్రెస్‌ల నుండి కొంతమంది ఎమ్మెల్యేలు చీలి వచ్చినా బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటు చేయడం సులభమే అవుతుంది.

ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేస్తారన్నది ఇప్పుడు గవర్నర్ చేతిలో వుంది. పెద్దపార్టీని మొదట ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తే బీజేపీ పట్ల గవర్నర్ తన స్వామిభక్తిని చాటుకున్నట్లే! ఎందుకంటే ఇటీవలే గోవా ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపార్టీగా అవతరిస్తే అక్కడి గవర్నర్ పెద్దపార్టీ కాంగ్రెస్‌ను ఆహ్వానించలేదు. జేడీఎస్ - కాంగ్రెస్ కూటమికి మొదటి ఛాన్స్ ఇచ్చేంత సాహసం గవర్నర్ చేయకపోవచ్చు. ఎంతైనా ఆయనా ఒకప్పటి బీజేపీ నాయకుడే కదా!

కాబట్టి మొదటి అవకాశం బీజేపీకే ఇచ్చి బలనిరూపణకు సమయం ఇవ్వొచ్చు. ఈలోపు మిగతా ఎమ్మెల్యేలను బీజేపీ నాయకులు జేడీఎస్, కాంగ్రెస్‌లను చీల్చి తెచ్చుకోవచ్చు.

**కాంగ్రెస్ స్వయంకృతాపరాధం**

కర్నాటకలో ఓటమి కాంగ్రెస్ చేజేతులా తెచ్చుకున్నదే! ఇక్కడ సిద్ద రామయ్య ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదు. సీఎంగా యడ్యూరప్ప, కుమారస్వామిలకంటే ఆయనవైపే ప్రజలు మొగ్గుచూపారు. కాని కొన్ని సొంత తప్పులే కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసాయి. జేడీఎస్‌తో పొత్తు విషయంలో కాంగ్రెస్ సక్సెస్ కాలేకపోయింది. పొత్తు కుదిరివుంటే ఈరోజు ఫలితం ఇంకో విధంగా వుండేది. ఇక మతపరమైన సెంటిమెంట్ల జోలికి పోయి హిందువులలో వ్యతిరేకత తెచ్చుకున్నారు. ఎవరూ అడగకపోయినా టిప్పుసుల్తాన్ జయంతి అంటూ ఆర్భాటం చేయడం, లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ కెబినెట్‌లో ఆమోదించడం వంటివి ఆయనపై కొన్ని వర్గాల్లో అసంతృప్తిని కలిగించాయి. బీజేపీ ఎన్నికల ప్రచారంలో వీటిని బాగానే వాడుకుంది. రాహుల్, సోనియాలొచ్చి ప్రచారం చేసినా కాంగ్రెస్‌కు ఉప యోగం లేకుండాపోయింది. దేశంలో కాంగ్రెస్ అధికారంలో వున్న పెద్ద రాష్ట్రం ఇదే! ఇప్పుడు ఈ రాష్ట్రం కూడా చేజారిపోయినట్లే!

దీంతో కాంగ్రెస్ ఒక ప్రాంతీయ పార్టీ స్థాయికి పడిపోయినట్లయ్యింది. పంజాబ్, మిజోరాం రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో వుంది. అంటే కాంగ్రెస్ ముక్త్ భారత్ నా లక్ష్యం అన్న మోదీ లక్ష్యం దాదాపు 90శాతం నెరవేరినట్లయ్యింది. బీజేపీ మాత్రం మిత్రపక్షాలతో కలిసి 20 రాష్ట్రాలలో వుండగా కర్నాటకలో కూడా అధికారం చేపడితే అది 21వ రాష్ట్రం అవుతుంది.

# కవితలకు ఆహ్వానం

పెన్నా రచయితల సంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే కవిసమ్మేళనంకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు పెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక అంశంపై 25లైన్లకు మించకుండా ఈ నెల 31వ తేదీలోగా పంపుకోవాలని కోరారు. 10 ఉత్తమ కవితల్ని ఎంపికచేసి ఇ.రామయ్య జ్ఞాపకార్థం వారికి వార్షికోత్సవంలో బహుమతి ప్రదానం చేయ నున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాల్గొన్న కవులందరికీ జ్ఞాపికలిస్తామన్నారు. కవితలను అవ్వారు శ్రీధర్‌బాబు, డోర్ నెంబరు 23-1-57, పెండెం వారివీధి, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు చిరునామాకు పంపాలని కోరారు. ఇతర వివరాలకు 8500130770 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

# ఎమ్మెల్సీ బీదకు కృతజ్ఞతలు

కోవూరు ఏఎంసి ఛైర్మన్‌గా తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు రామిరెడ్డి విజయభానురెడ్డి తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నెల 13న ఆయన బీద రవిచంద్ర నివాసంలో కలసి సన్మానించారు. వేగూరు చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కొత్త చూపు కోసం

- చిన్ని నారాయణరావు

వర్తమాన భారతదేశ
ఆర్థిక ముఖచిత్రం
ఛిద్రమైపోతున్నది
విశిష్ట మహానగాలు
పేకమేడలై కూలిపోతున్నాయి
అవినీతి పునాదులపై నిర్మిత
మహాసౌధాలు మటుమాయమవుతున్నాయి
ఇది దిగాలుపడ్డ ధాత్రి
సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ధరిత్రి
బ్యాంకుల రాబందులు
దేశ సంపదల్ని తమ డిపాజిట్లుగా
విత్‌డ్రా చేసుకుంటున్నాయి
ఎన్ని ఆడిట్ల గద్దలు నెగళ్ళుగా
కాంకరెంట్లతో పనిచేస్తేనేం
ఎన్ని నిఘా నేత్రాలు సెర్చిలైట్లు
వెలుగుల్లో పరిశీలిస్తేనేం
వైట్‌కాలర్ అవినీతి వడగళ్ళు
వాన ముందు
ఆడిట్ చూపు అవిటిదైపోయింది
ఒకడు -
నీరవ నిశ్శబ్ద తలంలో
వజ్రాల్నే ఆయుధాలుగా మలచి
హామీల ప్రకంపనలతో
చెక్‌బుక్ లేకుండానే డబ్బులు లాగేస్తే
మరొక కంత్రీ -
పెన్నుల పిస్తోళ్ళతో
బ్యాంకుకు గురిపెట్టి కొత్త పథకం రచించాడు
వజ్రాల్నే గుడ్లుగా పొదిగి
మోసాల అనకొండలతో
డబ్బును ఏరులై పారించాడొకడు
ధనాగారాలకు కలుగులు చేసి
తవ్వుకుంటున్నా గుడ్లప్పగించి
బ్యాంకు పిల్లులు చూస్తూనే ఉన్నాయి
మరొక జగత్ కిలాడీ -
విహాయస వాహనంలో విహరిస్తుంటే
విజయకేతనం ఎగురవేస్తాడనుకున్నాం
అవినీతితో తలంటి విదేశాలకు
చెక్కేస్తాడనుకోలేదు
పెళ్ళికొడుకు వేషధారణ
గావిస్తాడనుకోలేదు
బ్యాంకులకు చుక్కల పచ్చలు
తొడుగుతాడనుకోలేదు
సామాన్యుడి నగదుతో స్నానించి
విలాసాల్లో తేలియాడే
అవినీతి ప్రహేళికల ముందు
అతగాడో -
చెల్లని చెక్కయిపోయాడు
సర్ఫేసీ డిమాండుతో
వాడి అంతిమయాత్రకు
ప్రభుత తనవంతు పాత్ర పోషిస్తున్నది
మనిషిప్పుడు కొత్తగుండెలు
తొడుక్కుని
సరికొత్త చైతన్యంతో
ప్రస్థానించాలి
కొత్త బ్యాంకింగ్ చూపు కోసం
యుద్ధోన్ముఖుడు కావాలి!

## నివాళి




మే 5వ తారీఖున తుదిశ్వాస విడిచిన వింజమూరు వాస్తవ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణపం ఓబుల్‌రెడ్డి నివాసాన్ని మే 16వ తేదీ బుధవారం నాడు సందర్శించి వారి మృతికి నివాళులర్పించిన వైయస్సార్సీపీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి ప్రశాంతి. జిల్లా పరిషత్ చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వారితో పాటు వింజమూరు సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపిపి గణపం కృష్ణకిరణ్‌రెడ్డి ఉన్నారు.

# బొక్కబోర్లా పడ్డ బాబు

*'అనువుగాని చోట అధిక ప్రసంగం పనికిరాదు' అని పెద్దలు ఒక సామెత చెప్పారు. తెలుగుదేశం నాయకులకు ఇది సరిగ్గా సరిపోతుందేమో! వీళ్ళకు సంబంధం లేని కర్నాటక ఎన్నికల్లో అతిగా జోక్యం చేసుకుని, అనవసరంగా వేలు పెట్టి పరువు పోగొట్టుకున్నారు. కర్నాటక ఎన్నికల్లో తెలుగుదేశం నాయకుల ఓవర్ యాక్షన్‌కు కన్నడ ఓటర్లు తగిన గుణపాఠం చెప్పినట్లయ్యింది.*



కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు మన రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదు. కాంగ్రెస్‌ను గెలిపించండంటూ ఏపి కాంగ్రెస్ నాయకులు కర్నాటకకు వెళ్ళి ప్రచారం చేశారు. తప్పు లేదు. వారంతా ఒకే పార్టీ కాబట్టి. అలాగే బీజేపీ వాళ్ళు కూడా చేసుకున్నారు. ఇవి జాతీయ పార్టీలు కాబట్టి ఒక రాష్ట్రంలో నాయకులు ఇంకో రాష్ట్రంలో తమ పార్టీల గెలుపు కోసం పనిచేయవచ్చు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీ. ఆంధ్రా, తెలంగాణలకు పరిమితమైన పార్టీ. వాళ్ళు కర్నాటక ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదు. ఏ పార్టీకి ఓటేయమని చెప్పలేదు. ఎందుకంటే కాంగ్రెస్, బీజేపీ రెండూ ఏపికి ద్రోహం చేసాయి. కాబట్టే జగన్ ఆ రెండు పార్టీలకు సమదూరం పాటించాడు. జేడీఎస్‌తో ఎలాంటి పొత్తుగాని, స్నేహం గాని లేదు. కాబట్టే ఆ పార్టీకీ మద్దతునివ్వలేదు. ఇక టీఆర్ఎస్ అంటే ఫెడరల్ ఫ్రంట్‌లో వుంది కాబట్టి జేడీఎస్‌కు మద్దతునిచ్చింది.

మరి తెలుగుదేశం పార్టీకి కాంగ్రెస్‌తో పొత్తు లేదు. ఫెడరల్ ఫ్రంట్‌లో భాగస్వామి కాదు. అసలు కర్నాటక ఎన్నికలతో ఎటువంటి సంబంధం లేదు. కాని కర్నాటకలో బీజేపీని ఓడించాలంటూ తెలుగుదేశం నాయకులు తెగ ప్రచారం చేశారు. చంద్రబాబు నాయకత్వంలోనే ఇదంతా జరిగింది. కొందరు మంత్రులతో పాటు స్వయం ప్రకటిత మేధావులను, ఎన్జీఓల సంఘం నాయకుడు అశోక్‌బాబును కూడా చంద్రబాబు కర్నాటకకు పంపించాడు. తెలుగుప్రజలు అధికంగా వుండే ప్రాంతాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయించారు. ప్రత్యేకహోదా ఇవ్వకుండా ఏపికి అన్యాయం చేసిందని తెలుగు ఓటర్లను బీజేపీపైకి రెచ్చగొట్టాలనుకున్నారు.

కర్నాటక ఫలితాలలో బీజేపీ వెనుకబడిపోయి వుంటే చంద్రబాబు ఇప్పటికే జబ్బలు చరుచుకుని వుండేవాడు. ఇది తన ఘనతేనని. తాను చక్రం తిప్పబట్టే కర్నాటకలో బీజేపీ ఓడిపోయిందని ప్రచారం చేసేవాడు. పచ్చమీడియా ఛానళ్ళు కూడా అదే బాకాను ఊదేవి.

కర్నాటక ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రావడంతో చంద్రబాబు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. ఆయన ప్రచారం కన్నడలోని తెలుగు ఓటర్లను ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోయింది. స్థానిక అంశాల ప్రాతిపదికనే అక్కడి తెలుగు ఓటర్లు ఓట్లేసారు. అనవసరంగా కర్నాటకలో వేలుపెట్టి చంద్రబాబు పరువు పోగొట్టుకున్నాడు.


N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Affiliated to JNTUA, Anantapuramu
Vidyanagar, S.P.S.R. Nellore Dt. Phone : 08624 - 228247.
Estd: 1979
IT / CSE / ECE / EEE / CIVIL / MECHANICAL
EAMCET CODE NBKR
INFORMATION CENTRES
NELLORE
CHANDRA REDDY DEGREE COLLEGE
(Near VRC-9441443136,8500473704)
LLF SCHOOL
(Vedayapalem-9441858680,9491076300)
VEDAVYASA SCHOOL
(Magunta Layout-9959822821,8500767195)
GUDUR
SWARNANDRA BHARATHI JR COLLEGE
(9491170916,9701691869)
NAIDUPETA
SRI VEMA JR COLLEGE
(9490250405, 9491351267)
SULLURUPETA
SRI SATHYAM JR COLLEGE
(9440890235, 9490096093)
VENKATAGIRI
ESS DEGREE COLLEGE
(9963233414)
SRIKALAHASTI
THE SCHOOL
(9441393863, 9441567698)
TIRUPATI
COVALENT IIT&NEET MEDICAL ACADEMY
( M.R. Palli Circle 8125659841, 7382442543)
Contact 9441572755
Website www.nbkrist.org


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com